

నేడు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జూలై 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరుగుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఇప్పుడు వద్దులే బా!

సాగునీటి సంఘాల సభ్యుల తీరిది!

- ఏడు నెలలైనా బాధ్యతలు తీసుకోని కమిటీలు



వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల వ్యవస్థ జిల్లాలో నిర్వీర్యమైపోతోంది. గత ప్రభుత్వంలో కమిటీలను నియమించకపోవడం, ఇంజనీర్లకు ప్రత్యేకాధికారుల బాధ్యతలు అప్పగించడంతో వ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఒక పద్ధతి, విధానం అంటూ లేకుండా సంఘాల నిర్వహణ జరగడంతో ఆ ప్రభావం కొత్తగా ఎన్నికైన వారిపై పడుతోంది. గతేడాది డిసెంబరులో సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తయినా నేటికీ సగానికిపైగా కొత్త కమిటీలు బాధ్యతలు తీసుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం జీఎస్టీ నోటీసులు అందుతుండటమే. గతంలో చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించినా.. పాత అధ్యక్షులు, ప్రత్యేకాధికారులు జీఎస్టీలు కట్టలేదు. ఇప్పుడు ఆ బకాయిలు చెల్లించాలంటూ వరుసపెట్టి నోటీసులు అందుతున్నాయి. దీంతో కొత్త కమిటీలు హడలిపోతున్నాయి. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ తాము బాధ్యతలు తీసుకోలేమంటూ తేల్చి చెబుతున్నారు. ఈ కమిటీలన్నీ ఇంకా స్పెషలాఫీసర్ల పాలనలోనే కొనసాగుతున్నాయి.

- వరుసబెట్టి జీఎస్టీ నోటీసులు అందుతుండటమే కారణం
- గత కమిటీలు, ఇంజనీర్ల నిర్వాకంతోనే..

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 6 ప్రాజెక్టు కమిటీలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 486 డబ్ల్యూఏ (సాగునీటి సంఘాలు) ఉన్నాయి. గడిచిన ఆరేళ్లుగా ఈ కమిటీలు, సాగునీటి సంఘాలకు ఎన్నికలు లేవు. వైసీపీ అధికారంలోకి రాగానే 2019లో అప్పటివరకూ ఉన్న సాగునీటి సంఘాల కమిటీలను రద్దు చేసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించలేదు. ప్రాజెక్టు కమిటీలకు ఇరిగేషన్ ఎస్ఈలను, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈఈలను, డబ్ల్యూఏలకు ఆయా డీఈఈలను స్పెషలాఫీసర్లుగా నియమించింది. వీరి ఆధ్వర్యంలోనే ఐదేళ్లపాటు నీటి సంఘాల పాలన సాగింది. క్షేత్రస్థాయిలో కాలువపై ఏదైనా సమస్య తలెత్తితే రైతులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక నానా అవస్థలు పడేవారు. రైతుల అవసరాలను, క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. గతేడాది సాగునీటి సంఘాల ఎన్నికలకు పూనుకుంది. ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, డబ్ల్యూఏలు అన్నింటికీ ఎన్నికలు నిర్వహించింది. డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కొత్తగా ఎన్నికైన వారికి బాధ్యతలు అప్పగించాలని స్పెషలాఫీసర్లను ఆదేశించింది. అలానే ఈ కమిటీలకు ఇప్పటివరకూ రూ.5 లక్షలలోపు పనులు మాత్రమే నామినేషన్ కింద చేసేందుకు అవకాశముండగా, ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచింది.

● మెమోల జారీ

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఎన్నికలు నిర్వహించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కో కమిటీ కాలపరిమితి రెండేళ్లు మాత్రమే. అంటే ఇప్పటికే ఏడు నెలలు గడిచిపోయాయి. మరి జీఎస్టీ సమస్యలు పరిష్కారమయ్యేదెప్పుడు? సాగునీటి సంఘాల కొత్త కమిటీలు బాధ్యతలు తీసుకునేదెప్పుడు..? అన్నది చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను సంప్రదించగా.. కొన్ని కమిటీలు ఇంకా బాధ్యతలు తీసుకోలేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. వెంటనే కొత్త కమిటీలకు బాధ్యతలు అప్పగించాలని సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

● రూ. కోట్ల జీఎస్టీ ఎగనామం

2019 వరకూ సాగునీటి సంఘాల పేర్లపై రూ.వందల కోట్ల పనులు జరిగాయి. ఎక్కువగా నీరు-చెట్టు పనులే ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేసి బిల్లులు తీసుకున్నాక నీటి సంఘాల అధ్యక్షులు నిర్దేశించిన జీఎస్టీ మొత్తాన్ని కట్టాల్సి ఉంటుంది. అయితే చాలా మంది జీఎస్టీలు కట్టలేదు. ఆ తర్వాత వచ్చిన స్పెషలాఫీసర్లు కూడా ఇదే దారిలో నడిచారు. నీరు-చెట్టు బిల్లులు రాకపోవడంతో నీటి సంఘాల అధ్యక్షులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత బిల్లులు పడ్డాయి. ఇటీవల కూడా ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులన్నింటినీ విడుదల చేసింది. ఇందులో నుంచి జీఎస్టీను పట్టుకొని మిగిలిన డబ్బులను పాత కమిటీ అధ్యక్షులకు ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకుండా జీఎస్టీ మొత్తాలను కూడా లాగేశారు. అయితే కొన్ని సంఘాల ఖాతాల్లో మాత్రం జీఎస్టీ డబ్బులు అలానే ఉన్నాయి. చట్ట ప్రకారం స్పెషలాఫీసర్లు ఎప్పటికప్పుడు జీఎస్టీ బకాయిలను క్లియర్ చేసుకుంటూ రావాల్సి ఉండగా అలా చేయలేదు. దీంతో ఇప్పుడు ఆయా సంఘాలకు నోటీసుల మీద నోటీసులు అందుతున్నాయి. ఒక సంఘానికి రూ.5 లక్షలు కట్టాలని వస్తే, మరో సంఘానికి రూ.25 లక్షల వరకూ బకాయి ఉన్నారంటూ నోటీసులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు, కమిటీ సభ్యులు బాధ్యతలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు.



యూరియా కోసం పడిగాపులు

ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ కార్యాలయంలో కౌంటర్ వద్ద రైతులు



యూరియా కొరత వెంటాడుతుండటంతో రైతుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ నెలలో ఇప్పటి వరకు 67 మెట్రిక్ టన్నులు ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీకి సరఫరా అయ్యాయి. రైతులకు ఆధార్ కార్డుపై ఒక్కొక్కరికి నాలుగైదు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. ఇవి ఒక ఎకరాకుకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల మండలాల రైతులు ప్రతిరోజు ఆత్మకూరుకు యూరియా కోసం వచ్చిపోతున్నారు. బయట మార్కెట్‌లో బస్తా యూరియా కావాలంటే రూ.360లకు కనుగోలు చేయాలి. దీంతోపాటు ఒక పాస్పెట్ కట్ట కొంటేనే యూరియా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాల్లో యూరియా బస్తా రూ.270లకు లభిస్తోంది. ఈ క్రమంలో ఆత్మకూరు సొసైటీకి మంగళవారం 36 టన్నులు (800 బస్తాలు) యూరియా వచ్చింది. ఇది తెలుసుకున్న రైతులు యూరియా కోసం రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



ఉదయగిరి : ఎండదెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న ఉదయగిరి బస్టాండ్

అబ్బా.. ఏమి ఎండ!

వేసవిని తలపించేలా భగ్గుమంటున్న భానుడు

జూలైలోనూ మే నెలను తలపించేలా భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 7 గంటలకే సూర్యుడు సుర్రు మంటున్నాడు. మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు 37, 38, 39 డిగ్రీలు నమోదవుతున్నాయి. వర్షాలు కురిసి, వాతావరణం చల్లగా ఉండాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో భరించలేని వేడి పుడుతోంది. ఉత్తరాదిన వర్షాలు కురుస్తూ వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇందుకు భిన్నంగా జిల్లాలో సెకండ్ సమ్మర్ వచ్చిందా అన్న రీతిలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లు మధ్యాహ్నానికల్లా బోసిపోతున్నాయి. ఎండవేడిమి భరించలేక పిల్లలు, వృద్ధులు, దినసరి కూలీలు అవస్థలు పడుతున్నారు. పడమటి గాలులు వీస్తుండటం, ఆశించిన మేర వర్షాలు కురకపోవడం, భూమి చల్లదనం కాకపోవడంతో ప్రజలు వేడిగాలులతో అల్లాడుతున్నారు.

- నెల్లూరు (వైద్యం)/ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

సోమశిల జలాశయానికి 2800 క్యూసెక్కుల కృష్ణాజలాలు

- డెల్టాకు నీటి కొరత రానీయం : ఎస్ఈ

సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి కృష్ణానది నుంచి సుమారు 2800 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందని ఆ జలాశయ ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డితో కలిసి కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ వినయ్ కుమార్‌ను అడిగి కాలువలకు విడుదల చేస్తున్న నీటి వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఈ మాట్లాడుతూ డెల్టాలో సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు సాగునీరు పుష్కలంగా ఉందన్నారు. దీనికితోడు కృష్ణా జలాలు సోమశిల జలాశయానికి రావడం ప్రారంభమయిందని, రోజుకు సుమారు 2800 క్యూసెక్కుల ప్రవాహం వస్తుందన్నారు. ప్రస్తుతం డ్యాం నుంచి డెల్టాకు 3600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఇందులో కనిగిరి రిజర్వాయర్‌కు 1260, కావలి (బెజవాడ పాపిరెడ్డి) కాలువకు 800 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు రాకుండా అవసరమైతే నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య, ఏఈ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్లను పరిశీలిస్తున్న సోమశిల జలాశయం ఎస్ఈ రమణారెడ్డి

● 'సోమశిల'లో 28 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 2,793 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 28.200 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీకృష్ణధర్మ రాజుస్వామి ఆలయంలో దర్బార్ అలంకారం



ధ్వజావరోహణం గావిస్తున్న అర్చకులు

యుధిష్ఠర పట్టాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి యుధిష్ఠర పట్టాభిషేకం (దర్బార్ అలంకారం) కనుల పండువగా జరిగింది. మహాభారత ఘట్టాల ఆధారంగా 22 రోజుల నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు పట్టాభిషేక అలంకరణతో ముగిశాయి. చివరి రోజు ఉదయం విశేష పూజలు, చప్పర ఉత్సవం, అన్నదానం జరిగాయి. సాయంత్రం ధ్వజావరోహణం, విశేష పూజలు, నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో జానకి పర్యవేక్షించారు.

19, 20 తేదీల్లో వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేయనున్నట్లు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గమాటి శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేయనున్నట్లు తెలిపారు. సాధారణంగా విజయవాడలోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగే ఈ రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ ఈసారి నెల్లూరు జిల్లా వైద్యులకు ప్రభుత్వ వైద్య కళాశాలలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. దేశంలో మొట్టమొదటి సారిగా వైద్యుల వద్దకే మెడికల్ కౌన్సిల్ వచ్చి సేవలు అందిస్తోందని తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు
తొలిరోజు ప్రశాంతం

నెల్లూరు (హరనాథపురం), జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాలలో ఏపీపీఎస్సీ లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి జరిగిన పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెం వద్ద అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తనిఖీ నిర్వహించారు. ఈ నెల 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

వడ్డీ కాదు.. మొత్తం కట్టాల్సిందే!

- పంట, బంగారు రుణాల రీషెడ్యూల్‌లో మెలిక
- అసలు, వడ్డీ కట్టాల్సిందేనని బ్యాంకర్ల షరతు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ప్రజలు

దుత్తలూరు మండలానికి సుబ్బారెడ్డి గతేడాది తనకున్న పొలంలో శనగ సాగు చేసేందుకు రూ.2 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఈ ఏడాది దిగుబడి తగ్గడంతోపాటు మద్దతు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూశాడు. తీసుకున్న పంట రుణాన్ని వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకొందామని బ్యాంకుకు వెళ్లగా అసలు, వడ్డీ మొత్తం కడితేనే రెన్యువల్ చేస్తామని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో సుబ్బారెడ్డి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

ఉదయగిరి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు గతేడాది తన కుమారుడి చదువు కోసం బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి రూ.2.50 లక్షల రుణం తీసుకున్నాడు. సమయానికి నగదు దొరక్కపోవడంతో బ్యాంకుకు వెళ్లి వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకొందామని వెళ్లగా అధికారులు ఒప్పుకోలేదు. దీంతో చేసేదేమీ లేక వడ్డీ వ్యాపారుడి వద్దకు వెళ్లి రూ.లక్షకు రోజుకు రూ.5 వేలు చొప్పున రూ.2.5 లక్షలు తీసుకుని బ్యాంకుకు చెల్లించాడు. తిరిగి ఆ నగదు ఆ బ్యాంకులో పెట్టి వడ్డీ వ్యాపారికి చెల్లించాడు.


ఉదయగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గోరుచుట్టుపై రోకటిపోటులా దిగుబడులు లేక.. మద్దతు ధర పలకక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన తమను బ్యాంకర్లు ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. సాగు కోసం తీసుకున్న రుణాలను వడ్డీ సహా అసలు చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని చెబుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నగదు అత్యవసరమై బ్యాంకుల్లో బంగారం కుదవపెట్టిన ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొన్ని బ్యాంకులు వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలను రెన్యువల్ చేస్తుండగా, కొంతమంది బ్యాంకర్లు మాత్రం అసలు, వడ్డీ కడితేనే రెన్యువల్ చేస్తామని తేల్చి చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక రుణ గ్రస్తులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

● భారీగా తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడులు లేకపోవడం, అరకొరగా వచ్చిన దిగుబడులకూ మద్దతు ధర పలకకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా వరి, పసుపు, శనగ, పొగాకు, మిర్చి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, మినుము, కంది తదితర పంటలు సాగు చేస్తారు. ఈసారి ప్రకృతి వైపరీత్యాల తీవ్ర ప్రభావం దిగుబడులపై చూపడంతో రైతులు నష్టాలు చవిచూశారు. దీంతో పంటల సాగుకు బ్యాంకుల నుంచి పలువురు రైతులు రుణం తెచ్చుకొన్నారు. ఇలాంటి సమయంలో బ్యాంకర్లు అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే రుణాలు రీ షెడ్యూల్ చేస్తామని చెప్పడంతో వారు ఆవేదనలో పడ్డారు.

● వడ్డీ వ్యాపారుల హవా

ఆశాజనకంగా దిగుబడులు లేకపోవడంతో రైతులు, సమయానికి నగదు అందక ప్రజలు వడ్డీ కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అసలు చెల్లించాలని బ్యాంకులు చెబుతుండటంతో మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో కొందరు చేసేదేమీలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు రూ.లక్షకు రోజువారీగా రూ.2 వేల నుంచి 5 వేలు, వారానికి రూ.10 వేల నుంచి 20 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వడ్డీ చెల్లిస్తే రుణాలు రెన్యువల్ చేసేలా చర్యలు చేపట్టాలని రుణగ్రస్తులు కోరుతున్నారు.



మామూళ్లు ఇస్తున్నాం...
ఇక అడ్డేముంది!

- బరి తెగిస్తున్న రేషన్ మాఫియా
- అక్రమాలపై కాలు కదపని అధికారులు
- అల్లీపురంలో 20 టన్నుల బియ్యం సీజ్
- వారం రోజులైనా బయటకు రాని విషయం

జిల్లాలో రేషన్ మాఫియా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల సహకారం పుష్కలంగా ఉండటంతో అక్రమార్కులు తగ్గేదేలా అంటున్నారు. ఎవరెన్ని ఫిర్యాదులు చేసుకున్నా.. నిఘా వర్గాలు నివేదికలు అందజేసినా తమకేమీ కాదంటూ బహిరంగంగానే చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. 'కింది నుంచి పై వరకూ అందరికీ మామూళ్లు ఇస్తున్నాం.. ఆఖరుకు రేషన్ బియ్యంపై ఎన్‌ఫోర్స్ చేసే ప్రతి శాఖకు నెల మామూళ్లు కడుతున్నాం.. ఇక తమకు అడ్డేముంద'ంటూ మాఫియా మాట్లాడుతోందని పౌరసరఫరాల శాఖలో విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మాఫియా బహిరంగంగానే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నా అధికారుల నుంచి కనీస స్పందన ఉండటం లేదు. ప్రతి నెలా 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తారు. ఈలోపు ఆ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే బియ్యం నిల్వలో ఎంత తేడా ఉందో అర్థమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలానే మిల్లులలో తరచూ తనిఖీలు చేస్తుంటే చాలా వరకూ మాఫియాను కట్టడి చేసేందుకు అవకాశం కలుగుతుంది. కానీ గతంలో మాదిరి ఇప్పుడు ఏ ప్రభుత్వ శాఖ కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణాను సీరియస్‌గా తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వారం రోజుల క్రితం అల్లీపురంలో ఓ మిల్లులో 20 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే ఇప్పటికీ ఈ విషయం బయటకు రాకపోవడం గమనార్హం. సాధారణంగా ఒక అక్రమ వ్యవహారాన్ని బట్టబయలు చేసినప్పుడు అధికారులు ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. మరొకరికి ఇదొక హెచ్చరికగా ఉంటుందన్నది అధికారుల భావన. కానీ ఇక్కడ మాత్రం అలా జరగలేదు. కాగా ఇలా సీజ్ చేసిన బియ్యాన్ని కొత్తూరు వద్దనున్న ఎంఎల్ఎస్ పాయింట్‌కు అదే రోజు అర్ధరాత్రి తరలించారు. సాధారణంగా ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న హమాలీలే ఏ లోడ్ వచ్చిన బస్తాలు దించుతుంటారు. కానీ అల్లీపురం నుంచి తెచ్చిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ గోదాములో పెట్టేందుకు బయటి వ్యక్తులను పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక హమాలీలు టీడీపీ నాయకులను తీసుకొచ్చి అన్‌లోడింగ్‌ను అడ్డుకున్నారు. ఎందుకు బయట వ్యక్తులను తీసుకొచ్చారంటే ఏ అధికారి నుంచీ సమాధానం రాలేదు. ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన బస్తాల్లో చాలా వరకూ నూకలు ఉన్నట్లు టీడీపీ నాయకులు, హమాలీలు గుర్తించారు. మరి నూకలు ఎక్కడి నుంచి వచ్చాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే అల్లీపురం మిల్లులో బియ్యం సీజ్ చేసిన రోజునే రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరి మంత్రి సమీక్ష నేపథ్యంలోనే ఆ రోజు ఒక మిల్లులో దాడి చేసి ఆ తర్వాత మిన్నకుండిపోయారా..? అన్న ప్రచారం కూడా జరుగుతోంది.



అల్లీపురంలోని ఓ మిల్లులో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

చెక్‌పోస్టు పెట్టాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు వెంకటాచలం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. ఇప్పటికైతే మా సిబ్బందే అక్కడ పని చేస్తున్నారు. పోలీసు సిబ్బందిని కూడా అడిగి ఉన్నాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతోంది.

- విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

ఓటర్ల జాబితా నిర్వహణపై శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నిర్వహణపై బూత్ లెవల్ అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణలో మండలంలోని 37 మంది బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ కేవీ.సురేష్‌బాబు, ఎస్.శ్రీనివాసులు, ఏఎల్ఎంటీ యు. రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9419
వెండి కిలో ధర	రూ. 115100
వెండి ఒక గ్రాము	రూ. 118.10


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి

● జిల్లా కలెక్టరు ఆనంద్

కోవూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తుల పరిష్కర వేదికలో వచ్చే పిటిషన్లను సత్వరం పరిష్కరించాలని కలెక్టరు ఓ ఆనంద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు రూమును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ వినతులను పరిష్కరిస్తున్న తీరును పరిశీలించేందుకు తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. రెవెన్యూ సిబ్బంది వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కోవూరు తహసీల్దారు కార్యాలయంలో ఐదు వినతులు పరిష్కారమయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయ సమస్యల్ని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య ఆయనకు వివరించారు.

నేడు మడమనూరుకు ఎమ్మెల్యే రాక

మనుబోలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ అయిన మడమనూరుకి బుధవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నారని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నాణ్యమైన భోజనం అందించండి

తోటపల్లిగూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ స్కూళ్లలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీ.రమణ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని సౌత్ ఆములూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు మంచి భోజనం అందించాలని, అలాగే పిల్లలు తిరిగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పౌష్టికాహారంలో పోషకాలు ఎక్కువ ఉంటాయని, పిల్లలకు తెలివితేటలు రావాలంటే ఆకుకూరలు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం డాక్టర్ బికరం రాజేంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో షాదీమంజిల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ సందీప్, డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 75 మంది రోగులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. 80 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు డాక్టర్ కందుకూరి చంద్రశేఖర్, డాక్టర్ మస్తాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

రాపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీఎల్‌వోలకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దారు పీ.లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. అలాగే ఫారం 6, 7లపై అవగాహన కల్పించారు. తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గం ఎలక్షన్ సీనియర్ సహాయకులు మల్లేశ్వరి, ఆర్ఐ రవితేజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం కొడవలూరు ప్రధాన కూడలి

కొడవలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడవలూరు ప్రధాన కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. తహసీల్దారు కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, మండల ప్రజాపరిషత్ కార్యాలయం, బ్యాంక్‌లు ఈ కూడలి పక్కనే ఉన్నాయి. అలాగే టపాతోపు, రాజుపాలెం ఇటు అల్లూరు, విడవలూరు మండలం నుంచి వచ్చే వాహనాలు ఈ కూడలి నుంచే వెళ్లాలి. ఈ కూడలిలో ప్రతిరోజు ఒకటి, రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కొడవలూరు ప్రధాన కూడలి

ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో అభివృద్ధి

వెంకటాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామదాసుకండ్రిగలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఇడిమేపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాట్ల వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చాట్ల వెంకట నరసింహరావు, మల్లి కోటేశ్వరరావు, చల్లా చెంచయ్య, కృష్ణయ్య, వలిపి వెంకటేష్, నాగూర్, చెంచయ్య, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన


ఇందుకూరు పేట : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు


సైదాపురం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో హైమావతి

ఇందుకూరు పేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడులో మండల వ్యవసాయాధికారి డీ.రఘునాథ రెడ్డి మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా మూడు దశల్లో ఎకరాకు 105 కిలోలు వేయాలని, అంతకు మించి వేస్తే కుళ్లు తెగులు, ఆకు ముడత, మోము పిప్పి వంటి తెగుళ్లు వస్తాయని తెలిపారు. రైతులు మట్టి నమూనాల నివేదిక ఆధారంగానే ఎరువులు మితంగా వాడి, నేల సారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటరమణయ్య, సీహెచ్ హరీష్, వీఏఏ నరేష్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించనప్పుడే రైతులు అధిక దిగుబడులు సాధించగలరని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత తెలిపారు. మండలంలోని ఊటుకూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నెలాఖరులోగా పంటలకు బీమా చేయించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మనుబోలు: వరిలో మోతాదు మించి యూరియా వాడితే పురుగులు, తెగుళ్లు ఎక్కువవుతాయని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. మండలంలోని రాజవోలుపాడు, వడ్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజవోలు పాడులో వరిపైరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలం సారం పెరగాలని పచ్చిరొట్ట విత్తనాలైన జీలగలు, జనుము చల్లుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లపూడి సర్పంచు రమాదేవి, టీడీపీ నాయకులు యానాదినాయుడు, విఏఏలు శివకుమార్, విజిత తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, వేముల చేడు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయశాఖాధికారి హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది, రైతు సదస్సులు నిర్వహించారు. వరిలో కాండం కుళ్లు తెగులు, అగ్గితెగులు, దోమపోటు కాండం తొలిచూపు వాటి లక్షణాలు నివారణ చర్యలపై రైతులకు ఏవో అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఏడీఏ శ్రీదేవి, జడ్పీటీసీ పోలయ్య, మండల టీడీపీ రైతు అధ్యక్షుడు కేపీ రాజు, టీడీపీ సీనియర్ నాయకుడు దాశినేని దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి, బిరదవోలు గ్రామాల్లో మంగళ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సీజన్‌లో వరి వేసిన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వరిని ఆశించే వివిధ వ్యాధులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఏవో ప్రతాప్, వీఏలు హేమలత, మౌనిక పాల్గొన్నారు.


పొదలకూరు : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

పరిశ్రమల్లో మాకు ఉపాధి కల్పించండి

● పైనంపురం చిన్న సంఘం గిరిజనులు

ముత్తుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల కోసం భూములిచ్చిన మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పైనంపురం చిన్న సంఘం గిరిజన కాలనీవాసులు కోరారు. మంగళవారం గిరిజన కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజనులమని తమను అన్నీ విధాలా థర్మల్ కేంద్రాల యాజమాన్యాలు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి దత్తత తీసుకున్న తమ గ్రామాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమకు కట్టించిన ఇళ్లు పడిపోతున్నాయని, కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేదన్నారు. థర్మల్ కేంద్రాల యాజమాన్యాల ద్వారా గిరిజన కుటుంబాలకు పరిహారం ఇప్పిస్తానన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. సోమిరెడ్డి ప్రత్యేక చొరవతో ఆధార్‌కార్డులు ఇచ్చినా, ఇప్పటివరకు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు ఏవీ అందలేదన్నారు. తమ గ్రామానికి చెందిన నెల్లూరు ఈశ్వరయ్య భార్య వెంకటరమణమ్మ ప్రైవేటు థర్మల్ కేంద్రంలో పనిచేస్తూ మృతి చెందినా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ కార్యకరమంలో సూరాయపాలెం, మల్లికార్జున, నెల్లూరు ఈశ్వరయ్య, తుపాకుల శ్రీరాములు, కంచి మురుగేష్, పత్రా పుట్టమ్మ, అక్కుల నాగమణి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజనులు

ఒక్క ఎకరా ఎండకుండా నీరు అందిస్తాం

● ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి

విడవలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్న్ చానల్ ఆయకట్టులో ఒక్క ఎకరా ఎండకుండా సాగునీరు అందిస్తామని ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఎండుతున్న పైరు.. రైతన్నల ఫైర్ కథనానికి అయన స్పందించారు. ఈ సందర్భంగా విడవలూరులో చౌకిచర్ల చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు సమాది శ్రీనివాసులతో కలసి మంగళవారం అయన విలేకర్లతో మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్ నుంచి ఈస్టర్న్ చానల్ ద్వారా విడవలూరుకి వచ్చే మార్గంలో 4వ డ్రాప్ పైన వద్ద షట్టరు లేకపోవడంతో నీరు దిగువకు పారలేదన్నారు. దీని వలన సాగునీటి పారుదలలో కొంత ఇబ్బందులు వచ్చాయన్నారు. అయితే కలాసీల సహాయంతో సుమారు 300 ఇసుక బస్తాలను గండికి వేసి సాగునీటిని దిగువకు వచ్చేలా చేశామన్నారు. కొంత మంది రైతులు కలాసీలు ముడుపులు తీసుకుని నీటిని దారి మళ్లిస్తున్నారని ఆరోపణలు చేయ్యడం సరికాదన్నారు. సాగునీటి విషయంలో కలాసీలు నిజాయితీగా పని చేస్తున్నారని, వారికి కొన్ని నెలలుగా జీతాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నా రైతులకు సేవ చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కలాసీలు షేక్ షబ్బీర్, యాసిన్, జగత్, శ్రీనాథ్ సహబ్, శ్రీనివాసులు, విజయకుమార్ వాసు, సందానిబాషా తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నీటి సంఘం నాయకులు

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పొదలకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. సాయిబాబా ఏజన్సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జనవరి నుంచి యూరియా క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ రాఘవరావు (ఒంగోలు విజిలెన్స్ సీఐ) ఏడీఏ రవికుమార్ (వినుకొండ ఏడీఏ), పొదలకూరు ఏడీఏ శివనాయక్, పొదలకూరు మండల వ్యవసాయ అధికారి వీ.ప్రతాప్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర


పోలేరమ్మకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ముత్తుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరివారి కండ్రిగలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. వేకువనే అమ్మవారిని ఊరి శివార్లకు కొలువుంచి పూజలు నిర్వహించారు. అనంతరం చద్ది నివేదించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతకు పొంగళ్లు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

నోటి దురుసుతో ప్రతిష్ట దిగజార్చొద్దు

● టీడీపీ నేత చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి


మాట్లాడుతున్న చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి

కోవూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): నోటి దురుసుతో కోవూరు ప్రతిష్టను దిగజార్చొద్దని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులను, ఆమెకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగాడన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్నా వెంటనే పార్టీ నుంచి ప్రసన్నకుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గిద్దలూరు ఉమ, టీడీపీ నాయకులు కలికి సత్యనారాయణరెడ్డి, వీరంశెట్టి మధు, ఇంటూరు విజయ్, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వ్యక్తిగతంగా విమర్శిస్తే పుట్టగతులుండవు

● ప్రసన్న వ్యాఖ్యలకు నిరసనగా మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

విడవలూరు జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహిళలను వ్యక్తిగతంగా విమర్శిస్తే కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి పుట్టగతులుండవని టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, మండల తెలుగు మహిళాధ్యక్షురాలు చలంచర్ల కామేశ్వరమ్మలు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగతంగా విమర్శలు చేసిన ప్రసన్న తీరుకి నిరసనగా మంగళవారం విడవలూరులో మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక సినిమా హాలు సెంటర్ నుంచి అంకమ్మ దేవాలయం వరకు ర్యాలీని నిర్వహించి అ ప్రాంతంలో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడినందుకే గత ఎన్నికల్లో ప్రసన్నకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినా కుక్కతోక ఒక్కరన్న చందంగా మహిళా ఎమ్మెల్యేని రాజకీయంగా ఎదుర్కొనలేక వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడని ఆరోపించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులకు బహిరంగ క్షమాపణ చేప్పకపోతే దానికి తగిన మూల్యం భవిష్యత్తులో ఎదుర్కొంటాడని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, కొమ్మి శ్రీధర్‌నాయుడు, కుడుముల మల్లికార్జున, పల్లం శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

C.R.I.M.E N.E.W.S

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

● ఆరుగురికి స్వల్పగాయాలు
● కొడుకు కళ్లెదుటే తండ్రి దుర్మరణం
● అతివేగమే ప్రమాదానికి కారణం

రాపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబర్తి గ్రామ సమీపాన ఎన్‌హెచ్-565పై మంగళవారం అతివేగంగా ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడగా, ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. రాపూరు మండలం గోనుపల్లి నుంచి ఏడుగురు వ్యక్తులతో ప్రయాణిస్తున్న ఆటో పెనుబర్తి దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోనుపల్లికి చెందిన పీ.మస్తాన్ (47) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడితోపాటు అతడి చిన్నకొడుకు అదే ఆటోలో ఉండగా, అతనికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ పెంచలయ్య పరారయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులను 108 సహాయంతో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పంచనామా కోసం రాపూరు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మస్తాన్ (ఫైల్)

● బైక్‌కు ఫైనాన్స్ కట్టివస్తానని...

ఉదయం 8గంటలకు మస్తాన్, చిన్న కుమారుడు మదన్ కుమార్(7)ను తీసుకుని వెంకటగిరిలో బైక్ ఫైనాన్స్ కట్టొస్తానని ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చారు. ఇద్దరూ ఆటో ఎక్కిన కొన్ని క్షణాల్లోనే ప్రమాదం జరిగింది. తనతో ఆడి పాడే నాన్న.. ఎలాంటి కదలికలు లేకుండా రోడ్డుపై పడి ఉండడంతో ఆ చిన్నారి తల్లడిల్లిపోయాడు. చనిపోయిన తండ్రి చేతిని అలానే పట్టుకుని కూర్చుని ఉండడంతో చూపరుల గుండె తరుక్కుపోయింది.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు..?

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఆస్తి కోసమై షేక్ మహ్మద్ హమీద్‌ను దారుణంగా హత్య చేసిన గుంటుపల్లి ఉమర్‌అలీ, హనీఫ్‌లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నిందితుల కోసం నాలుగు రోజులుగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ తరుణంలో మంగళవారం ప్రకాశం జిల్లా పామూరులో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే హత్య ఉపయోగించిన రాడ్‌ను సైతం ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న ముళ్లపొదల్లో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఎరువుల గోదాముల తనిఖీ

● రూ.3.24 కోట్ల పురుగు మందుల సీజ్


గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

కోవూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమడుగు రోడ్డు కూడలిలోని ఎరువులు, పురుగు మందుల గోదాములను విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా పురుగు మందుల విక్రయాలు జరిపినట్లు గుర్తించారు. దీంతో సుమారు రూ.3,24,65, 058 విలువచేసే పురుగు మందులను విక్రయించకుండా సీజ్ చేశారు. సీజ్ చేసిన స్టాకు వివరాలను జిల్లా వ్యవసాయాధికారికి తెలియజేస్తామని, తరుపరి చర్యలు డీఏవో తీసుకుంటారని తెలిపారు. ఎరువులు, పురుగు మందుల గోదాములను నిఖీలో విజిలెన్స్ కమిషనరేట్ ఎస్ఐ రాఘవరావు, వ్యవసాయసహాయ సంచాలకులు రవికుమార్, ఎంఏవో రజని పాల్గొన్నారు.

రచ్చ చేస్తున్నారన్నందుకు ఒకరిపై రౌడీషీటర్ దాడి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నిత్యం మద్యం సేవించి ఇళ్ల మధ్య రచ్చ చేస్తున్నారని ఇంటి యజమానికి చెప్పినందుకు ఓ వ్యక్తిపై రౌడీషీటర్ కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులో శెట్టిగుంట రోడ్డు నుంచి పప్పులవీధికి వెళ్లే దారిలో మురగా వల్లీ అనే మహిళ అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుటుంబ సభ్యు లు నిత్యం మద్యం సేవించి గొడవ చేస్తుండటంతో పక్కింట్లోని నరేంద్ర అనే వ్యక్తి ఇంటి యజమానికి తెలియజేశారు. దీంతో యజమాని ఇల్లు ఖాళీ చేయమన్నాడు. నరేంద్ర చెప్పిన విషయం తెలియడంతో వల్లీ కుటుంబం కక్ష పెంచుకుంది. ఆమె అల్లుడు, రౌడీషీటర్ అయిన బాను విష్ణువర్ధన్ అలియాస్ లడ్డాకు తెలియజేశారు. మంగళవారం ఉదయం నరేంద్ర పెన్నానదిలో బహిర్భూమికి వెళ్లగా అప్పటికే అక్కడ కాపుకాసిన విష్ణువర్ధన్ తన మిత్రులతో కలిసి నరేంద్రపై కత్తితో దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకునేసరికి నిందితులు పరారయ్యారు. నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యలమవారిదిన్నె ప్రాంతానికి చెందిన కాయల మోహన్ చందు అనే యువకుడిని హత్య చేసిన అతని స్నేహితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మోహన్ చందును అతని స్నేహితులు తరుణ్ కుమార్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సురేష్, శ్రీధర్ కలిసి పొదలకూరు మండలం విరువూరులో హత్య చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో నిందితులను అరెస్టు చేసి న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

చెవిలో పాట... మృత్యువుతో ఆట!

● విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

నెల్లూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చెవిలో ఇయర్ ఫోన్స్‌తో పాటలు వింటున్న యువకుడు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావునగర్‌కు చెందిన బాపన్ మెండల్ (22) షామి యానా పట్టలు వేసే పనికి వెళ్తుంటాడు. పెద్దచెరుకూరు వద్దనున్న సిరిగార్డెన్స్‌లో ఓ ఇంటి ముందు షామియానా పట్టలు వేస్తూ పైకెక్కి పనిచేస్తున్నాడు. ఆ సమయంలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నాడు. పక్కనే విద్యుత్ తీగలున్నాయి. వాటిని గమనించిన తోటి వ్యక్తులు కేకలు వేస్తున్నా అవి మెండల్‌కు వినపడలేదు. ఇంతలో విద్యుత్ తీగలు తగిలి ఆ యువకుడు కిందపడిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేకపోయినప్పటికీ శరీరం బాగా కాలిందని వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

ముఫ్తీ అబ్దుల్ వహాబ్‌కు పరామర్శ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణంగా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న జామియా నూరుల్ హుదా అరబిక్ కాలేజ్ వ్యవస్థాపకుడు ముఫ్తీ షేక్ అబ్దుల్ వహాబ్‌ను మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ అహ్మద్ షరీఫ్, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పరామర్శించారు. మంగళవారం వహాబ్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నన్నేసాహెబ్ కూడా ఉన్నారు.



న్యూస్ బాక్స్

నేడు సాయిబాబా నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి గంధర్వ వాహనంపై నగరోత్సవం జరుగుతుందని మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవం గాంధీబొమ్మ కూడలి నుంచి ఏసీ సెంటర్, సంతపేట, చిన్నబజారు, పెద్దబజారు, వీఆర్‌సీ మీదుగా మందిరానికి చేరుతుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ తరలిరావాలని కోరారు. కాగా, మందిరంలో మంగళవారం షిరిడీ హారతులు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి.

గణేష్ ఉత్సవాలపై 19న కార్యాచరణ

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు గతేడాది కంటే మెరుగైన ఏర్పాట్లు చేసేందుకు తగిన కార్యాచరణ కోసం ఈ నెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు బయ్యా వాసు, అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రతినిధి బృందం మంగళవారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిశారు. గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్, నీటిపారుదల శాఖ, విద్యుత్, పోలీసు అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులతో 19వతేదీ ఉదయం 11 గంటలకు నెల్లూరు చెరువు గణేష్ ఘాట్ వద్ద సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఏవీఆర్ మోహన్‌రావు, శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు కప్పిర శ్రీనివాసులు, మండ్ల ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, కే మదన్ కుమార్, హర్షవర్ధన్, డీటీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి

నెల్లూరు రూరల్, జూలై 15,(ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 22వ డివిజన్‌లో ప్రజలతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అనేక మంచి కార్యక్రమాలు చేసిందన్నారు. కాగా, 31వ డివిజన్ లాయర్స్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బత్తల మంజుల, విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాది అలేఖ్య మృతి

నెల్లూరు(లీగల్), ఆంధ్రజ్యోతి 15 : నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు, న్యాయవాది అలేఖ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి బార్ అసోసియేషన్ కమిటీ, పలువురు న్యాయవాదులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సౌత్ మోపూరులో ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనాలోచిత నిర్ణయాలతో రైతులకు నష్టం

● ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాఫర్‌సాహెబ్ కాలువకు వైసీపీ ప్రభుత్వం రూ.100కోట్లతో రివిట్‌మెంట్ నిర్మాణం చేపడితే.... ప్రస్తుతం మంత్రి నారాయణ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో 80 శాతం పనులు చేస్తే మిగిలిన 20 శాతం పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేయలేదన్నారు. ఇక్కడి వాకింగ్ ట్రాక్‌పై అనాలోచితంగా 200 బంకులను ఏర్పాటు చేస్తున్నారని, వాటి వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని, కాలువలో వ్యర్థాలు పేరుకుంటా యని చెప్పారు. దీనిపై హైకోర్టుకు వెళ్లామని తెలిపారు.

మహిళా ట్యూటర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలోని హాస్టల్‌లో మహిళా ట్యూటర్స్‌గా పని చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ గణితం, బీకామ్ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.6వేల వేతనం, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.



జీతాలు పెంచండి !

● మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళ వారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య, నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు రోజులుగా ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో ఉన్నా ప్రభుత్వం స్పందించక పోవటం దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందటం లేదని చెప్పారు. కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండా ప్రసాద్, మాలకొండయ్య, నరసింహారెడ్డి, లవన్, ఇంజనీరింగ్ కార్మిక నాయకులు శ్రీనివాసులు, బాలు, ముని, మోహన్ కృష్ణ, మారుతి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ మార్గాలపై అవగాహన పెంచుకోవాలి

● ఐసీడీఎస్ అధికారులు

నెల్లూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని, వాటిని అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. మంగళవారం కొండ్లపూడి గ్రామంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సఖీ వన్‌స్టాప్ సెంటర్ న్యాయవాది ప్రశాంతి మాట్లాడుతూ బాలికల జోలికి ఎవరైనా వస్తే వారిని పోక్సో చట్టం కింద శిక్షించవచ్చని తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా సహాయానికి 1098, మహిళలకైతే 181, 112, సైబర్ క్రైంకు 1930 టోల్‌ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బాల్య వివాహం చేసుకున్నా, ప్రోత్సహించినా కఠిన శిక్షలుంటా యని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసూతి విభాగంలో సమస్యలు

నెల్లూరు (వైద్యం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగాన్ని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు సూపరింటెండెంట్‌కు వివరించారు. గచ్చు పగిలిపోయిందని, పైపులైన్ దెబ్బతిన్నదని, వాటికి చిన్నచిన్న మరమ్మతులు అవసరమని తెలియజేశారు. రాత్రి పూట వచ్చే రోగుల సేవకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. దీనికి సూపరింటెండెంట్ సమ్మతించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ పరమేశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, అభివృద్ధి కమిటీ సభ్యుడు మొగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

4 కోట్లు ఖర్చు... దర్గాలో రొచ్చు!

● రొట్టెల పండుగ పనుల్లో నాణ్యత లోపం ● వారానికే దెబ్బతిన్న టైల్స్, కొళాయిలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఇటీవల రొట్టెల పండుగ ఘనంగా జరిగినప్పటికీ, ఇందుకోసం చేసిన పనులు నాసిరకమని తేటతెల్లమైంది. ఆ పనుల్లోని డొల్లతనం వారం రోజులు కూడా కాకముందే బయటపడింది. రొట్టెల పండుగను ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నగరంలోని బారా షహీద్ దర్గా, స్వర్ణాల చెరువు తీరాన రాష్ట్ర పండుగగా వైభవంగా నిర్వహించారు. ఈ సంబరానికి తరలి వచ్చిన లక్షలాది మంది యాత్రికులకు సౌకర్యాల కల్పనకు దాదాపు రూ.4కోట్లకుపైగా నిధులు ఖర్చు చేశారు. ఈ క్రమంలో చేపట్టిన సివిల్ వర్క్‌ల నాణ్యత అధ్వానంగా ఉంది. ఈ నెల 10తో పండుగ ముగిసి భక్తుల సందడి తగ్గిన తర్వాత బారా షహీద్ దర్గా ప్రాంతం, స్వర్ణాల చెరువు ఘాట్‌లను సందర్శించిన వారికి గుండె తరుక్కుపోతోంది. పండుగ పేరుతో హడావిడిగా పనులు చేయించారు. పండుగ ముగిసి వారం రోజులు కూడా కాకముందే స్వర్ణాల ఘాట్‌లో వేసిన టైల్స్ కొన్ని దెబ్బతిన్నాయి. మరికొన్ని ఊడిపోయాయి. ఈ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

ఎటు చూసినా చెత్తే!

ప్రస్తుతం దర్గా మైదానం చెత్త కుండీలా తయారైంది. దీంతో దర్గా పవిత్రతకు భంగం వాటిల్లుతోంది. దర్గా వద్ద ఏర్పాటు చేసిన కొళాయి దెబ్బతిని నీరంతా వృథాగా పోవడమేకాక దర్గా ముందు రొచ్చులా మారింది. గతంలో దర్గా, స్వర్ణాల చెరువు వద్ద ఘాట్ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.30కోట్లు ఖర్చు చేసింది. కేవలం రొట్టెల పండుగ అప్పుడే కాకుండా ఏడాదంతా నగర ప్రజలకు ఉదయం, సాయంకాలం వేళల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో ఘాట్ వెంబడి పచ్చని మొక్కలతో (గార్డెన్) సిద్ధం చేసింది. ఒక వైపు చెరువు నుంచి చల్లని గాలులు, మరోవైపు పచ్చదనం ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేవి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గ్రీనరీ లేకపోవడంతో ఘాట్ ప్రాంతం ఎడారిని తలపిస్తోంది. దీనికితోడు రాత్రిపూట దర్గా ప్రాంతం గంజాయి సేవించేవారు, మందుబాబులతోపాటు పలు అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. గతంలో ఇలాంటివి జరగకుండా వాచ్‌మన్, పోలీసు గస్తీ ఉండేవి. ఇప్పుడవేవీ కనిపించడం లేదు.



దర్గా ముందు ఇసుక, వ్యర్థాలు, నీటి మడుగు

● గుదిబండలా లేక్ క్లీనర్....

స్వర్ణాల చెరువు, బోట్ క్లబ్‌పై ఇరిగేషన్, ఇతర శాఖల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువులో గుర్రపుడెక్కాకు విపరీతంగా పెరిగిపోయింది. దానిని తొలగించేందుకు లేక్ క్లీనర్ అనే భారీ యంత్రాన్ని తెచ్చారు. అయితే ఆ వాహన యంత్రం నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయారు. చెరువులో గుర్రపు డెక్కాకు సమస్య పూర్తిగా తీరలేదు, కానీ ఖర్చు మాత్రం బారెడు అవుతోంది.



ఘాట్‌లో దెబ్బతిన్న టైల్స్



కొళాయి ఊడిపోయి నీటి వృథా





దర్గా మైదానంలో విడిచిన వస్త్రాలు, పేరుకున్న వ్యర్థాలు

కరేడులో భూసేకరణ ఆపండి

● కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లూరు (వైద్యం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడులో కార్పొరేట్ సంస్థల కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ఆపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. భూసేకరణకు నిరసనగా నగరంలోని వీఆర్‌సీ వద్ద మంగళవారం నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పిలుపు మేరకు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఒక పక్క వనమహోత్సవాలు అంటూ నీతులు చెబుతూ మరో పక్క పచ్చటి పోలాలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయాలని చూస్తోందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు భూమిని కట్టబెట్టి గిరిజనుల పొట్ట కొట్టొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నాయకులు మల్లికార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనీఫ్, సుజాత, ఖాదర్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న పిల్లల గుర్తింపు

నెల్లూరు(హరనాథపురం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంతంలో పిల్లలతో భిక్షాటన చే స్తున్న కుటుంబాన్ని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ మంగళవారం గుర్తించా రు. పిల్లలతో భిక్షాటన చేయించటం నేరమని వారికి తెలియచేశారు. ఆ పిల్లలకు విద్యతోపాటు సంరక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సతీష్‌బాబు, రత్నం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ విభాగాల్లో కమిషనర్ పరిశీలన

నెల్లూరు(సిటీ), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ నందన్ మంగళవారం పరిశీలించారు. కమాండ్ కంట్రోల్, మలేరియా, పీజీఆర్ఎస్, లీగల్, పీఆర్వో, శానిటేషన్ మానిటరింగ్ విభాగాలను ఆయన పరిశీలించారు. వాటి పని తీరుపై యంత్రాంగాన్ని ప్రశ్నించారు. పీజీఆర్ఎస్‌ను మరింత సమర్థ వంతంగా నిర్వహించాలని సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహిస్తున్న స్మార్టు స్ట్రీట్ వెండార్స్ శిక్షణలో కమిషనర్ పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

హెచ్‌పీ గ్యాస్ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీ గ్యాస్ 51వ ఫౌండేషన్ డే సందర్భంగా జిల్లా హెచ్‌పీ గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు జరిగాయి. గ్యాస్ డీలర్లు ఎన్టీఆర్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి మహిళలకు గ్యాస్ పొదుపు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. స్టోన్‌హౌస్‌పేటలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. మహిళలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, జాగ్రత్తలను గైనకాలజిస్టు డాక్టర్ కొల్ల జ్యోతి, సౌమ్య విద్యార్థినులకు తెలియజేశారు.

వ్యాధులుండే చోట రక్త నమూనాలు సేకరించాలి

● జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ



రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తలు ప్రతీ బుధ, శనివారాల్లో రక్త నమూనాలు సేకరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ హుస్సేనమ్మ ఆదేశించారు. నగరంలోని జాకీర్ హుస్సేన్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించారు. సేకరించిన రక్త నమూనాలను ల్యాబ్‌కు అందచేయాలని, అనంతరం వ్యాధి నిర్ధారణ రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకురాలు కరుణమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు గిరిజావతి, సంజీవ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నెల్లూరు(విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వ హించారు. జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ మురళీకృష్ణ, నాయకులు ఏ శ్రీనివాసులు, వీ వెంగబాబు, జీ మహేష్, బీ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాపై అసత్య ఆరోపణలు

'ఉపాధి' కమిటీ కన్వీనర్ రఘు

నెల్లూరు(హరనాథపురం), జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతిని, అక్రమాలను బయటపెట్టడానికి నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటైందని, ఆ కమిటీపై కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆ కమిటీ జిల్లా కన్వీనర్ కొప్పాల రఘు తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం సోషల్ ఆడిట్ తనిఖీల్లో అనేక అక్రమాలు వెలుగు చూసినట్లు అధికారులే ప్రకటించారన్నారు. ఈ క్రమంలో కమిటీని ఏర్పాటు చేసి, అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని తెలిపారు. అయితే ఉపాధి హామీ జేఏసీకి చెందిన కొందరు తమ కమిటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, అసత్య ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సుందరం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వన మహోత్సవం



వన మహోత్సవ ర్యాలీలో విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం నారాయణ కాన్సెప్ట్ పాఠశాలలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి మొక్కలు పెంచడంపై దృష్టి సారించాలన్నారు. పర్యావరణ పరిరక్షణతోపాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించడంలో మొక్కలు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు సేవ్ ట్రీస్.. సేవ్ ఎన్విరాన్‌మెంట్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ నరేంద్రరెడ్డి, హెచ్‌ఎం వెంగళరావు, ఏవో శివరంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా అదనపు వైద్యాధికా రి డాక్టర్ ఖాదర్‌వలి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని వెంకట రమణ ఆసుపత్రి స్కానింగ్ సెంటర్, విజయ డయాగ్నిక్ సెంటర్, శ్రీనివాస స్కానింగ్ సెంటర్‌ను వైద్య బృందంతో కలిసి తనిఖీ చేశారు. పీసీపీఎన్‌డీటీ నిబంధనల ప్రకారం స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారా.. లేదా? అంటూ రికార్డులు పరిశీలించారు. ప్రతీ స్కానింగ్ సెంటర్ తప్పని సరిగా ఫారం 4 ను సకాలంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందచేయాలని సూచించారు. అవసరమైతే తప్ప లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని ఆదేశించారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్‌ఎడ్యుకేషన్ అధికారి నరసింహా రావు, టీబీ నివారణ అధికారి విజ యకుమార్, హరీష్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు, ఆపరేషన్లు

● కార్పొరేషన్ వెటర్నరీ వైద్యుడు మదన్



నెల్లూరు(సిటీ), జూలై 15,(ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు ఇంట్లో పెంచుకుంటున్న కుక్కలకు ఉచితంగా టీకాలు, ఏబీసీ ఆపరేషన్లు చేస్తామని కార్పొరేషన్ పశువైద్యుడు మదన్‌మోహన్ తెలిపారు. మంగళ వారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాతమున్సిపల్ కార్యాలయం వద్దనున్న ఏబీసీ సెంటర్‌కు పెంపుడు కుక్కలను తీసుకువస్తే వివరాలు నమోదు చేసుకుని యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. అలాగే పిల్లలు పుట్టకుండా ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) ఆపరేషన్ కూడా అక్కడే ఉచితంగా చేస్తారని తెలిపారు. నగరంలో బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా పశువులను వదిలితే వాటిని తమ సిబ్బంది కల్లూరుపల్లిలోని గోశాలకు తరలిస్తారని, వాటిని తిరిగి వదిలేది లేదని స్పష్టం చేశారు. పందుల పెంపకందారులకు కూడా నోటీసులు జారీ చేశామని, జన సంచారం లేని ప్రాంతాల్లో పందులను పెంచుకోవాలని హెచ్చరించినట్లు తెలిపారు.

భళా.. భార్గవ్!



- ఏపీఎల్ కాకినాడ కింగ్స్ జట్టుకు ఎంపిక
- ఇండియా, ఐపీఎల్‌లో ఆడటమే లక్ష్యం : భార్గవ్ మహేష్

కావలి (టౌన్), జూలై 15 (ఆంధ్ర జ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కాకినాడ కింగ్స్ జట్టుకు కావలి వాసి భార్గవ్ మహేష్ ఎంపికయ్యారు. పట్టణంలోని పాతూరుకు చెందిన సమాధి వెంకట కృష్ణమూర్తి, ఉమ దంపతుల కుమారుడు భార్గవ్ చిన్నతనం నుంచి క్రికెట్‌పై మక్కువతో పాఠశాల స్థాయి నుంచి ఆడుతూ ప్రతిభ కనపరుస్తున్నారు. భార్గవ్‌లోని ప్రతిభను గమనించిన కోచ్ రాజశేఖర్ శిక్షణ అందించారు. మినీ స్టేడియం (డీఎస్ఏ) మైదానంలోని కావలి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెట్స్‌లో సాధన చేస్తూ కోచ్ వద్ద మరిన్ని మెలకువలు నేర్చుకుని ఆల్ రౌండర్‌గా ఎదిగారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు నుంచి ప్రాతి నిధ్యం వహించి ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి పలువురి ప్రశంసలు అందుకున్నారు. విశాఖలో ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (క్రికెట్)లో ఆడేందుకు నిర్వహించిన వేలంలో రూ.90వేలకు భార్గవ్‌ను ఎంపిక చేశారు. దీంతో పట్టణ, జిల్లా క్రికెట్ ప్రముఖులు క్రీడాభిమానుల ఆయనకు అభినందనలు తెలిపారు.

మరింత ముందుకు సాగుతా : భార్గవ్ మహేష్

తనలోని ప్రతిభను గుర్తించిన కోచ్ రాజశేఖర్ శిక్షణ అందించడం కావలి క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిద్ధు, తన తండ్రి అందించిన ప్రోత్సాహం, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో తాను రాణించగలిగాను. ఏపీఎల్‌కు కాకినాడ కింగ్స్‌కు ఎంపికవడం సంతోషంగా ఉంది. మరింత రాటుదేలేందుకు ప్రతిభ చాటుకునేందుకు ఏపీఎల్‌ను వేదికగా మలుచుకుంటాను. ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం, ఐపీఎల్‌కు ఆడడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాను.

మెనూ ప్రకారం

భోజనం పెడుతున్నారా!?

- విద్యార్థినులను ఆరా తీసిన కలెక్టర్ ఆనంద్
- గురుకులం, కుట్టు శిక్షణ, ఉపాధి హామీ పనుల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

అల్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : భోజనంలో మెనూ పాటిస్తున్నారా? అని విద్యార్థునులను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన అల్లూరుకు చేరుకుని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, నీటి వసతి, వారు ఉండేందుకు తగిన వసతులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలికలతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భగా స్థానిక టీడీపీ నాయకుడు బీద గిరిధర్ కలెక్టర్‌ను కలిసి బాలికల గురుకుల పాఠశాల శాశ్వత భవనాలకు కేటాయించిన స్థలానికి సంబంధించిన నివేదికను అందజేసి పూర్తి వివరాలు తెలియజేశారు. అల్లూరులో సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్ ముందుగా గాలిదిబ్బలు ప్రాంతంలో కూలీలు చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వారికి 120 రోజుల పనిదినాలను కల్పిస్తున్నారా లేదా అని కూలీలను ప్రశ్నించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

ఐవీఆర్ఎస్ కాల్స్‌లో

సోమలరేగడకు ద్వితీయ స్థానం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 15(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం చేసే ఐవీఆర్ఎస్ కాల్స్‌లో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ జిల్లాలో ద్వితీయస్థానం సాధించినట్లు కావలి డీఎల్‌పీవో పీ.వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమగలరేగడ పంచాయతీలోని ప్రజలకు ప్రభుత్వ నుంచి వచ్చిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పారిశుద్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా 92 శాతం, వారానికి కనీసం రెండుసార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా 91 శాతం సమాధానం ఇవ్వడంతో జిల్లాలో ద్వితీయ స్థానం నిలిచిందన్నారు. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఒక పంచాయతీకి సంబంధించిన ఇంటి పన్నులు, యజమానుల వివరాల పక్క పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి పొరపాట్లు ఉంటే సరి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సోమగలరేగడ పంచాయతీ కార్యదర్శిని ఎం.నాగ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీ డీవో మల్లికార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి


ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 15 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరులోని ప్రధాన బస్టాండులో ఉన్న ప్రాంతీయ కార్యాలయ ప్రాంగణంలో ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న అనేక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్, రవికాంత్ పాల్గొన్నారు.

పాఠశాలకు అయ్యోర్యారు డుమ్మా!

- 2 రోజులుగా రాకపోవడంతో తెరుచుకోని తలుపులు

కావలి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయు డే పాఠశాలకు డుమ్మా కొట్టాడు. కావలి మండ లం ఆముదాలదిన్నె పంచాయతీ లింగంగుంట లో బడికి తాళం వేసి రెండు రోజులుగా పత్తా లేకుండా పోయాడు. తల్లిదండ్రుల వివరాల మేరకు లింగంగుంట ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా, ఏకోపాధ్యాయు డిగా కృష్ణ నాలుగేళ్లుగా పని చేస్తున్నాడు. రెండవ శని, ఆదివారాలు సెలవు రావటం తో ఇళ్లకే పరిమితమైన విద్యార్థుల సోమవారం బడికి వెళ్లారు. కానీ తలుపులు తీయకపోవడంతో వెనుతిరిగి వచ్చేశారు. మంగళవారం కూడా ఇదే పరిస్థితి. దీంతో పిల్లలు తల్లిదండ్రులకు చెప్పటంతో వారు వచ్చి చూడగా పాఠశాలకు తాళం వేసి ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తూ మీడియా దృష్టికి తెచ్చారు.



పాఠశాల తలుపులకు వేసిన తాళం

ఎలాంటి సమాచారం లేదు

సోమ, మంగళవారాలు ఆ టీచరు సెలవు పెడుతున్నట్లు మాకు సమాచారం లేదు. ఈ పాఠశాల ముసునూరు క్లస్టర్ పరిధిలో ఉందని సెలవు విషయం క్లస్టర్‌లో పనిచేసే హెచ్ఎంకు కూడా చెప్పకపోవటం, ఫోన్‌కు అందుబాటులో లేకపోవడంపై డీఈవో దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. గతంలో కూడా ఆయనపై అనేక ఆరోపణల రాగా, షోకాజు నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

- గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు

ప్రభుత్వ బీఈడీ కళాశాలకు

ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన

నెల్లూరు (విద్య), జూలై 15 (ఆంధ్ర జ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నిర్వహిం చిన బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ విద్యా ర్థినులు సీహెచ్ మహిమ 8.6 శాతంతో ప్రథమ స్థానం, షేక్ తమ్‌సిన్ 8.5 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. మున్ముందు మరిన్ని మంచి ఫలితాలు సాధించేలా విద్యాబో ధన అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు

గ్రావెల్ దందాకు

అడ్డుకట్ట పడేనా..?



ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

ఉదయగిరి రూరల్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ ప్రాంత భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రావెల్‌ను ట్రాక్టర్లలో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నా అధికారులు మౌనం వహిస్తు న్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లేఅవుట్లు, బొగ్గు, ఇటుక బట్టీలు, ఇతర వాణిజ్య అవసరాలకు మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకోవడం సవాలక్ష నిబంధనలతో కూడుకున్నపని. ఈ నిబంధనలను తుంగలో తొక్కిన వ్యాపారులు అక్రమ వ్యాపారానికి తెరలేపారు. రాత్రీపగలు తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు సాగిస్తూ గ్రావెల్‌ను సరిహద్దులు దాటించి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, కావలి నియోజక వర్గాల్లో విస్తారమైన చెరువులు, ప్రభుత్వ, అటవీ భూములు అధికంగా ఉన్నాయి. దీంతో అక్రమార్కులు చెరువులతోపాటు కొండలను సైతం కొల్లగొడుతూ గుల్ల చేస్తున్నారు.

● నిరంతరం తరలింపు

రోజూ లెక్కకు మించిన ట్రాక్టర్లతో గ్రావెల్ ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల అనుచరులకు నగదు ముట్టజెప్పి సాగిస్తున్న దందాపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన సమయంలోనే అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తరువాత పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో స్థానికులే స్వచ్ఛందంగా అక్రమ వ్యాపారులను అడ్డుకుంటుండడం గమనార్హం.

● అనుమతులు అంతంతే..

నియోజకవర్గంలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు. కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోని గ్రామాల్లో గోరంత అనుమతులు పొంది, కొండంత వ్యాపారం సాగిస్తున్నారు. అధికార పార్టీ అండతో అడ్డంకులు లేకుండా గ్రావెల్ వ్యాపారం సాగిస్తూ చెరువులు, వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను సైతం నామరూపాలు లేకుండా చేస్తున్నారు. దీంతో ఇష్టానుసారంగా తీసిన గుంతలు వర్షాల సమయంలో ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, గ్రావెల్ అక్రమ దందాను అడ్డుకోవాల్సి ఉంది.



గ్రావెల్ తవ్వకాలతో తూర్పుబోయమడగలలో ప్రమాదకరంగా మారిన గుంతలు

రాజేష్‌పై దాడి చేసిన వ్యక్తిపై

కేసు నమోదు

- మొగిలిచెర్లలో పోలీస్ పికెట్

లింగసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్లలో గోరంట్ల రాజేష్‌పై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసిన చుండూరు పోతులూరయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం నారాయణ మంగళవారం తెలిపారు. ఈ దాడిలో గాయపడిన రాజేష్ కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరడంతో అక్కడి పోలీసులు బాధితుడు రాజేష్ స్టేమెంటును నమోదు చేసుకొని పంపించగా, ఆ మేరకు పోతులూరయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మొగిలిచెర్లలో ఎలాంటి గొడవలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలో సోమవారం రాత్రి నుంచే పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పికెట్ మంగళవారం కూడా కొనసాగింది.

జేవీవీ రాష్ట్ర కమిటీలో

జిల్లా బాధ్యులు



శ్రీనివాసులు రెడ్డి

ఉదయగిరి రూరల్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): జనవి జ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీలో జిల్లా బాధ్యులకు సముచితం స్థానం లభించింది. జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పని చేసినవారిని గుర్తించి, ఈనెల 13న కడప లో జరిగిన రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లాకు చెందిన కుమ్మిత శ్రీనివాసు లురెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపి కయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా జీ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బీ విశ్వ నాథ్, ఉపాధ్యక్షుడిగా వీ చక్రపాణి, కార్యదర్శిగా ఏవీ గీతాంజలి, సలహా మండలి, న్యాయశాఖ, ఆరోగ్య సబ్ కమిటీ సభ్యులుగా కేవీ శేషారెడ్డి, ఎం శివ పార్వతి, వీ వేణుగో పాల్, సభ్యులుగా పీ బాలకోటేశ్వరరావు, షేక్ గౌస్‌బాషాలను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని జిల్లా, మండలాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో

జేడీ విచారణ

నెల్లూరు (వైద్యం) జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో గత ఇన్‌చార్జ్ ఏవో, జూనియర్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డారంటూ గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నాగార్జునరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి మంగళవారం విజయవాడ నుంచి నెల్లూరుకు చేరుకుని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. మాజీ ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు తోపాటు జూనియర్ అసిస్టెంట్ సందీప్ విచారణలో పాల్గొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో జరిగిన ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాల్లో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని మాజీ ఏవో వెంకటేశ్వర్లును విచారణ అధికారి మల్లీశ్వరి ప్రశ్నించగా అవన్నీ నిరాధారమైనవని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో నియమితులైన 9 మంది ఫార్మసీ, ఎల్టీలని ప్రశ్నించగా తాము ఎవరికీ ముడుపులు ఇవ్వలేదని రాత పూర్వకంగా తెలిపినట్లు తెలిసింది. అయితే కావాలనే అధికారులు వారిని భయపెట్టి తమకు అనుకూలంగా రాయించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మరో కేసుకు సంబంధించి గతంలో డీఎంహెచ్‌వో సీపీగా పనిచేసిన సందీప్ అనే వ్యక్తి తిరుపతికి బదిలీ అయినా నెల్లూరు వైద్య ఆరోగ్యశాఖలో ఎలా పనిచేస్తున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. కాగా, విచారణ అంతా ఏకపక్షంగా జరిగిందని, మరోసారి విచారణ జరపాలంటూ ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ విచారణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కళాధర్‌రావును అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కళాధర్‌రావు

కావలి/నెల్లూరు (సాంస్కృతికం) : అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడిగా కావలికి చెందిన విశ్రాంత ఎంపీడీవో రేవూరు వెంకట కళాధరరావు ఎంపికయ్యారు. ఆ మహాసంఘం ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్ర కమిటీ శ్రీగురు పురస్కారాలు, విద్యా వత్ సభలు, పంచాంగకర్తల సదస్సులు ఈనెల 13, 14, 15 తేదీలలో నరసరావుపేటలో జరి గాయి. చివరి రోజైన మంగళవారం జిల్లా కమిటీల నియామకం జరిగింది. నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడితోపాటు గౌరవాధ్యక్షుడిగా వై.శేషగిరిరావు, కార్యదర్శిగా మామిడిపల్లి చంద్రశేఖర్‌రావు, కోశాధికారిగా భట్టారం రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా మాధవాచార్యులు, అర్చక పురోహిత విభాగం గౌరవ సలహాదారులుగా ఎం.నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కళాధరరావు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేస్తూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులకు విద్య, వైద్య రంగాల్లో చేయూతనిచ్చి వారి అభివృద్ధికి తోడ్పడతామన్నారు. అర్చక, పురోహితుల సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తిరుపతి, కడప జిల్లాల పరిశీలకుడిగా సురేంద్రబాబు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15(ఆంధ్ర జ్యోతి) : ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ తిరుపతి, కడప జిల్లాల నూతన కమిటీల ఎన్నికల పరిశీలకుడిగా నెల్లూరుకు చెందిన ఊరందూరు సురేంద్రబాబు నియమితుల య్యారు. ఈ మేరకు ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ ఏజే శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లా స్టోర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని, వెంటనే వాటిని డ్రా చేసి వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు లోని ఆయన కార్యాలయం నుంచి మంగళవారం జిల్లాలోని విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న వారి ఎస్టిమేషన్స్ వెంటనే సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించాలని, ప్రతీ ఫీడర్ పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌తో సంస్థపై పెనుభారం పడుతుందని, వీలైనంతవరకు దీనిని తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర వాట్సాప్ 95523 00009 నెంబరు ద్వారా విద్యుత్ సేవలను ప్రజలు పొందవచ్చన్నారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలని, సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

- మాజీ ఎమ్మెల్సీ విఠపు
- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



ధర్నా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాల సుబ్రహ్మణ్యం ఉద్ఘాటించారు. ఆల్‌ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ పెట్టడం దుర్మా ర్గపు చర్య అన్నారు. ఈ సవరణ బిల్లు పెన్షనర్ల పాలిట గొడ్డలిపెట్టు వంటిదని, తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లతో వినతిపత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఉపాధ్యాయ ఉద్యమనేత పీ బాబురెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయా లని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే ఖాసిం. కోశాధికారి హజరత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఏఎస్ పేట,జూలై15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపురంలో ఉన్న ఐటీఐలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ గౌస్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 20లోగా ఐటీఐ. ఏపీ.జీవోవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 23న కళశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9419
వెండి కిలో ధర	రూ. 115100
వెండి ఒక గ్రాము	రూ. 118.10

ముందుకు సాగని జలజీవన్..!

● తాగునీటి పథకాల పనులకు గ్రహణం ● పల్లెల్లో గొంతెండుతున్న ప్రజలు

ఆత్మకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం అమలులో దారుణంగా విఫలమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ పథకాన్ని ఐదేళ్ల విస్మరించింది. 2024 నాటికి పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. కాగా, సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. కోట్లాది రూపాయల నిధులు మంజూరైనా వైసీపీ ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించిందనే ఆరోపణ లున్నాయి.

కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పరుగులెత్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో ఎంఎస్ నెం 17 పేరిట రూ. 49.60 కోట్లుతో 169 వర్కులను రివైజ్ చేసి వచ్చే ఏడాది మార్చి ఆఖరుకు పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో కొన్నింటికి టెండర్లు పూర్తయ్యాయి. కాని కాంట్రాక్టర్లు ఆసక్తి కనపరచకపోవడంతో జలజీవన్ పనులు ముందుకు సాగడం లేదు. ఆత్మకూరు నియోజకవర్గంలో 63,662 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2024 నాటికి వీటిల్లో 14,535 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కాని ఇప్పటికి 8,379 కుళాయి కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 6,156 కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని అధికారులు లెక్కలు చెబుతుండడం గమనార్హం. గతంలోనే ప్రతి గ్రామంలో చాలా వరకు ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న వాటికి పైపులైన్ ఇచ్చి.. అవన్నీ జలజీవన్ కింద ఇచ్చినట్లు నమోదు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


యర్రబల్లిలో అర్ధంతరంగా ఆగిన వాటర్ ట్యాంకు నిర్మాణం

● తాగునీటి పనుల సాగతీత

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మొత్తం 169 పనులు మంజూరయ్యాయి. వీటిని పూర్తి చేసేందుకు రూ.49.60 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ప్రక్రియ పూర్తయింది. కాని కాంట్రాక్టర్లు ఇంకా పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. 2022-23లో అగ్రి మెంట్ అయిన కొన్ని పనులు అర్ధంతరంగా ఆగిపోయి ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా మంజూరైన పనులతోపాటు అర్ధంతరంగా ఆగిపోయిన పనులను పూర్తి చేస్తేగాని ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా చేయడం వీలుకాదు.

● ఆత్మకూరు మండలంలో 39 పనఉలకు రూ. 16.63 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో 15 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వాటిలో కొన్నింటికి అగ్రిమెంట్ కూడా పూర్తయ్యాయి. పనులు మాత్రం ఎక్కడా మొదలుకాలేదు. 2022-23లో మండలంలో చేపట్టిన 18 పనులు అర్ధంతరంగా ఆగిపోయి ఉన్నాయి. మురగళ్ల, ఎర్రబల్లిలో వాటర్ ట్యాంకుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. మహిమలూరుకు పెన్నా నది నుంచి మంచినీటిని సరఫరా చేయుటకు ఏర్పాటు చేసిన పైపులైను పనులు సైతం ఆగిపోయి ఉన్నాయి.ఇలా అర్ధంతరంగా ఆగిపోయి ఉన్న పనులను సైతం పూర్తి చేయాల్సి ఉంది.

● అనంతసాగరం మండలంలో 37 పనులకు రూ. 9.93 కోట్లు, ఏఎస్‌పేట మండలంలో 23 పనులకు 4.59 కోట్లు, చేజర్ల మండలంలో 27 పనులకు రూ. 4.68 కోట్లు, మర్రిపాడు మండలంలో25 పనులకు రూ. 7.06 కోట్లు, సంగం మండలంలో 17 పనులు చేపట్టేందుకు రూ. 6.17 కోట్లు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. కానీ ఆత్మకూరు నియోజకవర్గం మొత్తం మీద జలజీవన్ పనులు మాత్రం జరగడం లేదు.

నేటి నుంచి గంధ మహోత్సవం

అనంతసాగరం జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతబజారులో వెలసి ఉన్న హజరత్ కరిముల్లాషా ఖాదరీ 132వ గంధ మహోత్సవాన్ని బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి ఖవ్వాలీ, గురువారం ఉరుసు కార్యక్రమాలు ఉంటాయని దర్గా ముతావల్లి నలావుద్దీన్ తెలిపారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేశామన్నారు.

సీఎం మారినా మారని హోర్డింగ్


తొలగించని మాజీ సీఎం హోర్డింగ్

అనంతసాగరం జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాదయినా మండలంలోని మస్రాపురం వద్ద రోడ్డు పక్కనే మాజీ సీఎం జగన్ హోర్డింగ్‌ను తొలగించలేదు. దాన్ని చూసిన ప్రజలు ఇంకా జగన్ సీఎంగా ఉన్నాడా... ? అని అనుకుంటున్నారు.ఇప్పటికైనా అధికారులు దాన్ని తొలగిస్తారా ? లేదో వేచి చూడాలి.

జయహో... శుభాంశు!



శుభాంశు శుక్లాకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

అనంతసాగరం జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షానికి వెళ్లి ప్రపంచంలో భారత కీర్తిని చాటి సురక్షితంగా భూమికి చేరిన భరతమాత ముద్దుబిడ్డ శుభాంశు శుక్లాకు వెల్కమ్ బ్యాక్... అంటూ మండలంలోని చిలకమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం జాతీయ పతాకం చేతపట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీ 4పై కార్యదర్శులతో సమీక్ష


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్

సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పీ 4 అమలుపై మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వారం పాటు గ్రామసభలు ఏర్పాటు చేసి, గుర్తించిన బంగారు కుటుంబాలను, మార్గదర్శకులతో మ్యాపింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

30 వరకు ఉచిత టీకాలు

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పశు వైద్యశాల పరిధిలో ఈనెల 30 వరకు పశువుల్లో లంపిస్కిన్(చర్మవ్యాధి) నివారణకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్రశర్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల వయసుపైబడిన ఆవు దూడలకు, ఆవులకు, ఎద్దులకు లంపిస్కిన్ వ్యాధికి తమ సిబ్బంది ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు

వేలం నిర్వహణ

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వాహనాలు, కూరగాయలు, మాంసం, రోజువారీ వసూళ్లకు సంబంధించి సర్వంచి సామ్రాజ్యం, ఎంపీడీవో అప్పాజీ వేలం నిర్వహించారు. ఈ వేలంలో షేక్ ఫైజుల్లా, షేక్ అబీద్, షేక్ అలీ పాల్గొనగా షేక్ ఫైజుల్లా ఆయా అంశాలకు సంబధించి రూ. 2.50 లక్షలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని బీఎల్వోలకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఆర్వో మురళి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ఎలా తయారు చేయాలి, ఫారం-6, 7, 8లను ఏలా పూరించాలి తదితరంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బీఎల్‌వోలకు పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. ట

ఆషాడ మాస సారెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాలేపాటి స్రవంతి

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 15(ఆంధ్రజ్యోతి): వెంగమాంబ పేరంటాలకు ఆషాడ మాసం సందర్భంగా గురువారం నిర్వహించే సారె కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా సహ కన్వీనర్ మాలేపాటి స్రవంతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలు పాడిపంటలు, ప్రజలు ఆయురారోగ్యాలతో సమృద్ధిగా ఉండాలనే ఉద్దేశ్యంతో అమ్మవారికి ఈ సారె సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా శ్రీవిరజానంద స్వామిజీ పాల్గొంటారన్నారు. సమావేశంలో ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ అంజమ్మ, కన్వీనర్ సోమినేని రవీంద్రబాబు, బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు వెంగమాంబకు నెల పొంగళ్లు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 15(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసి ఉన్న వెంగమాంబ పేరంటాల నెల పొంగళ్లు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీ. ఉషశ్రీ మంగళవారం తెలిపారు. వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం ముగిసిన, నెల తరువాత వచ్చే మొదటి గురువారం నెల పొంగళ్ల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహిస్తారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిషనర్ సీ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు జీ. శివప్రసాద్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, గౌరవాధ్యక్షుడు కే. డేవిడ్ రాజు, కార్యదర్శి కొండమూరు హజరత్తయ్య, మున్సిపల్ కార్మిక నాయకులు గురవయ్య, చెన్నకేశవులు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తోటలచెరువుపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై పద్ధతి మార్చుకుని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పంచాయతీ పరిధిలోని సాతువారిపల్లి, కొండ్రాజుపల్లి గ్రామాల్లోనూ గ్రీన్ అంబాసిడర్లు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం సమస్యలు తెలుసుకోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

సీతారామపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను అన్నారు. ఆమె మంగళవారం అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ, సింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ప్రీస్కూల్ హాజరు శాతాన్ని పెంచి చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు లక్ష్మీదేవి, పావని పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం


ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ

సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంగం పంచాయతీ కార్యదర్శి ఆర్ నరసయ్య గౌరవాధ్యక్షుడిగా, దువ్వూరు పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వీ రమేష్‌బాబు అధ్యక్షుడిగా, సిద్దీపురం కార్యదర్శి కే. శ్రీనివాసులురెడ్డి ఉపాధ్యక్షుడిగా, కొరిమెర్ల కార్యదర్శి సుధాకర్ ప్రధాన కార్యదర్శిగా, తరుణవాయి కార్యదర్శి ప్రవీణను టెజర్రర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన


త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఈఈ భానునాయక్, ఏఈ శ్రీహరి తదితరులు

సీతారామపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం గురించి ప్రతీ లబ్ధిదారుడు అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ శాఖ ఈఈ భానునాయక్ అన్నారు. మంగళవారం పొండ్రంగి గ్రామంలో ఆయన అధ్యక్షతన పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీహరి ,జూనియర్ లైన్‌మన్ హరికృష్ణ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తప్పులు లేని జాబితా తయారు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఆర్వో మురళి

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోకవర్గంలోని ఏఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఆర్వోలు, బీఎల్‌వోలు సమష్టిగా పనిచేస్తే తప్పులుతడకలు లేని ఓటర్ల జాబితాను తయారు చేయవచ్చన్నారు. 1200 ఓట్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లను గుర్తించి విభజించాలన్నారు. బుధవారం సీతారామపురం, గురువారం ఉదయగిరి మండలాల్లో బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో రాంమోహన్, టీడీపీ నాయకులు బయ్యన్న, తుమ్మల కిరణ్, వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


సన్మానం అందుకున్న బదిలీ ఉద్యోగులు

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తూ, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులను స్థానిక వైద్యశాలలో మంగళవారం సహచర సిబ్బంది సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, యూడీసీ సర్దార్, ఏఎన్‌ఎంలు గిరిజ, దేవి, పద్మ, నూర్జహాన్, షర్మిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శివకల్పన, వినీత, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దారు రాంమోహన్

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే భూముల రీసర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దారు ఎల్.రాంమోహన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే సమయంలో రైతుకు సమాచారం ఇవ్వడంతోపాటు వారికి ఎలాంటి నష్టం జరగకుండా సర్వే చేపట్టాలన్నారు. రీసర్వేపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ షాజియా, రీసర్వే డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ అబ్బాస్, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడొద్దు


ఆత్మకూరు : రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంఏవో కిశోర్‌బాబు

ఆత్మకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు విక్షణారహితంగా ఎరువులను వాడకూడదని, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయశాఖాధికారి కే కిషోర్‌బాబు తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పంటవీధి రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సల్ఫర్ కలిగిన 20-20-0-13 వంటి కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పొటాష్ ఎరువును దుక్కుల్లో, పంట ఆఖరి దశలో తప్పనిసరిగా వాడాలని సూచించారు. అనంతరం రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో వీ. రేణుక, పలువురు రైతులు పాల్గొన్నారు.

● సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలు తీసుకోని రైతులు పంటల బీమా చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక వ్యవసాయాధికారి శశిధర్‌తో కలిసి మండలంలోని పడమటిపాళెం, సిద్దీపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వరల్డ్ యూత్ స్కిల్ డెవలప్ మెంట్ అనే అంశంపై మంగళవారం వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఒకేషనల్ అధ్యాపక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అభినందనలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం బుజ్జయ్య

C.R.I.M.E N.E.W.S

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

- ఆరుగురికి స్వల్పగాయాలు
- కొడుకు కళ్లెదుటే తండ్రి దుర్మరణం
- అతివేగమే ప్రమాదానికి కారణం


మస్తాన్ (ఫైల్)

రాపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబర్తి గ్రామ సమీపాన ఎన్‌హెచ్-565పై మంగళవారం అతివేగంగా ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడగా, ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. రాపూరు మండలం గోనుపల్లి నుంచి ఏడుగురు వ్యక్తులతో ప్రయాణిస్తున్న ఆటో పెనుబర్తి దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోనుపల్లికి చెందిన పీ.మస్తాన్ (47) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడితోపాటు అతడి చిన్నకొడుకు అదే ఆటోలో ఉండగా, అతనికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ పెంచలయ్య పరారయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులను 108 సహాయంతో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పంచనామా కోసం రాపూరు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● బైక్‌కు ఫైనాన్స్ కట్టి వస్తానని...

ఉదయం 8గంటలకు మస్తాన్, చిన్న కుమారుడు మదన్ కుమార్(7)ను తీసుకుని వెంకటగిరిలో బైక్ ఫైనాన్స్ కట్టొస్తానని ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చారు. ఇద్దరూ ఆటో ఎక్కిన కొన్ని క్షణాల్లోనే ప్రమాదం జరిగింది. తనతో ఆడి పాడే నాన్న.. ఎలాంటి కదలికలు లేకుండా రోడ్డుపై పడి ఉండడంతో ఆ చిన్నారి తల్లడిల్లిపోయాడు. చనిపోయిన తండ్రి చేతిని అలానే పట్టుకుని కూర్చుని ఉండడంతో చూపరుల గుండె తరుక్కుపోయింది.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

ఉదయగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఆస్తి కోసమై షేక్ మహ్మద్ హమీద్‌ను దారుణంగా హత్య చేసిన గుంటుపల్లి ఉమర్‌అలీ, హనీఫ్‌లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నిందితుల కోసం నాలుగు రోజులుగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ తరుణంలో మంగళవారం ప్రకాశం జిల్లా పామూరులో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే హత్య ఉపయోగించిన రాడ్‌ను సైతం ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న ముళ్లపొదల్లో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఎరువుల గోదాముల తనిఖీ

● రూ.3.24 కోట్ల పురుగు మందుల సీజ్


గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

కోవూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమడుగు రోడ్డు కూడలిలోని ఎరు వులు, పురుగు మందుల గోదాము లను విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా పురుగు మందుల విక్రయాలు జరిపినట్లు గుర్తించారు. దీంతో సుమారు రూ.3,24,65, 058 విలువచేసే పురుగు మందులను విక్రయించకుండా సీజ్ చేశారు. సీజ్ చేసిన స్టాకు వివరాలను జిల్లా వ్యవసాయాధికారికి తెలియజేస్తామని, తరుపరి చర్యలు డీఏవో తీసుకుంటారని తెలిపారు. ఎరువులు, పురుగు మందుల గోదాములను నిఖీలో విజిలెన్స్ కమిషనరేట్ ఎస్ఐ రాఘువరావు, వ్యవసాయసహాయ సంచాలకులు రవికుమార్, ఎంఏవో రజని పాల్గొన్నారు.

రచ్చ చేస్తున్నారన్నందుకు ఒకరిపై రౌడీషీటర్ దాడి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నిత్యం మద్యం సేవించి ఇళ్ల మధ్య రచ్చ చేస్తున్నారని ఇంటి యజమానికి చెప్పినందుకు ఓ వ్యక్తిపై రౌడీషీటర్ కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులో శెట్టిగుంట రోడ్డు నుంచి పప్పులవీధికి వెళ్లే దారిలో మురగా వల్లీ అనే మహిళ అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుటుంబ సభ్యు లు నిత్యం మద్యం సేవించి గొడవ చేస్తుండటంతో పక్కింట్లోని నరేంద్ర అనే వ్యక్తి ఇంటి యజమానికి తెలియజేశారు. దీంతో యజమాని ఇల్లు ఖాళీ చేయమన్నాడు. నరేంద్ర చెప్పిన విషయం తెలియడంతో వల్లీ కుటుంబం కక్ష పెంచుకుంది. ఆమె అల్లుడు, రౌడీషీటర్ అయిన బాను విష్ణువర్దన్ అలియాస్ లడ్డాకు తెలియజేశారు. మంగళవారం ఉదయం నరేంద్ర పెన్నానదిలో బహిర్భూమికి వెళ్లగా అప్పటికే అక్కడ కాపుకాసిన విష్ణువర్ధన్ తన మిత్రులతో కలిసి నరేంద్రపై కత్తితో దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకునేసరికి నిందితులు పరారయ్యారు. నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యలమవారిదిన్నె ప్రాంతానికి చెందిన కాయల మోహన్ చందు అనే యువకుడిని హత్య చేసిన అతని స్నేహితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మోహన్ చందును అతని స్నేహితులు తరుణ్ కుమార్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సురేష్, శ్రీధర్ కలిసి పొదలకూరు మండలం విరువూరులో హత్య చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో నిందితులను అరెస్టు చేసి న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

చెవిలో పాట... మృత్యువుతో ఆట!

● విద్యుదాఘాతంలో యువకుడికి తీవ్రగాయాలు

నెల్లూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చెవిలో ఇయర్ ఫోన్స్‌తో పాటలు వింటున్న యువకుడు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావునగర్‌కు చెందిన బాపన్ మెండల్ (22) షామి యానా పట్టలు వేసే పనికి వెళ్తుంటాడు. పెద్దచెరుకూరు వద్దనున్న సిరిగార్డెన్స్‌లో ఓ ఇంటి ముందు షామియానా పట్టలు వేస్తూ పైకెక్కి పనిచేస్తున్నాడు. ఆ సమయంలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నాడు. పక్కనే విద్యుత్ తీగలున్నాయి. వాటిని గమనించిన తోటి వ్యక్తులు కేకలు వేస్తున్నా అవి మెండల్‌కు వినపడలేదు. ఇంతలో విద్యుత్ తీగలు తగిలి ఆ యువకుడు కిందపడిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేకపోయినప్పటికీ శరీరం బాగా కాలిందని వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234


కోడిగుడ్ల ధర (100): 515

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం పీజీ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న పేద మహిళ కృష్ణవేణి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ వారు ఆమెకు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు టీవీ శేషయ్య, సభ్యులు మంద వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, సుంకు కృష్ణ, క్లాత్ శ్రీను, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, బుజ్జి, గోపాల్, వెంకయ్య, కోటి పాల్గొన్నారు.



ఆ ఇళ్లకు మోక్షం లేదా?



శ్లాబ్ లెవెల్ వరకు జరిగిన నిర్మాణాలు

- లబ్ధిదారుల్లో కొరవడిన ఆసక్తి
- జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
- జాడలేని అవినీతి విచారణ నివేదిక
- అంతుపట్టని కూటమి ప్రభుత్వ ఆలోచన

కావలి(టౌన్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కావలిలో గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గొప్పలు చెప్పుకోగా అక్కడ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో ఈ ఇళ్లకు ఇక మోక్షం లేదా అన్న చర్చ జరుగుతోంది. ఈ ఇళ్లపై లబ్ధిదారుల్లో సైతం ఆసక్తి కరువైంది. ఈ లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని ప్రచారం జరగగా సంబంధిత, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఆ నివేదిక ఏమైందో కూడా తెలియని పరిస్థితి. దీంతో అసలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆలోచనా విధానం ఏమిటన్నది అంతుపట్టడం లేదని స్థానికులు బహిరంగంగా చెప్పుకొంటున్నారు. కావలి ముసునూరులోని మెగా జగనన్న లేఅవుట్ స్థల సమీకరణ నుంచి లబ్ధిదారుల ఎంపిక, గృహాల నిర్మాణం వరకు అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. నిర్మాణ బాధ్యతలు వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లకే అప్పజెప్పడం, వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతో గృహ ప్రవేశాలకు ముందే నిర్మాణ దశలోని అనేక గృహాలు చిన్నపాటి వర్షానికి, గాలికి కూలిపోయాయి. దీంతో లబ్ధిదారులు భయాందోళనలకు గురయ్యారు. ఒకవేళ ఈ ఇళ్లలో నివాసం ఉంటే ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ఏ అర్ధరాత్రో ఇళ్లు కూలి ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని భావించారు. దీంతో ఎలాగైనా ఎన్నికలకు ముందు గృహ ప్రవేశాలు చేయించి మైలేజ్ పొందాలన్న వైసీపీ ఆశలు అడియాశలయ్యాయి. దీంతోపాటు జగనన్న గృహాల అవినీతి గుప్పుమనడం, నాసిరకం నిర్మాణాల విషయం బయటపడడం, ఎక్కడి నిర్మాణాలు అక్కడే అసంపూర్తిగా ఆగిపోవడంతో లబ్ధిదారులకు ఆసక్తి లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న గృహాల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం, విచారణ బృందం విచారణ జరిపినా నివేదికలు కార్యరూపం దాల్చకపోవడం, అవినీతిపై చర్యలు చేపట్టకపోవడం అంతుపట్టని విషయంగా మారింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన జగనన్న గృహాల ప్రక్రియ అడుగడునా అవినీతికి కేరాఫ్‌గా మారింది. ముసునూరు వద్ద దాదాపు 110 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి 8,970 ఇళ్లను మంజూరు చేశారు. స్థలంలో గుంతలు, బొంతరాయి కొండను చదును చేసేందుకు రూ.21.78 లక్షలు మంజూరు చేయగా అప్పట్లో లేఅవుట్‌లోని విలువైన గ్రావెల్‌ను వైసీపీ నాయకులు రియల్టర్లకు అమ్ముకున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. నీటి వసతి కోసం వేసిన బోర్లు కూడా విఫలమవ్వడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. తాగునీటి వసతి కోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించుకుని అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో చేసేదిలేక వైసీపీ నేతలే కాంట్రాక్టర్లుగా మారి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. నిర్మాణంలో నాసిరకం వస్తువులు ఉపయోగించడం, నిర్మాణ దశలోనే అనేక నిర్మాణాలు కూలిపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు అటువైపు రావడం మానుకున్నారు. మంజూరైన 8,970 గృహాల్లో పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగినవి వందలోపే ఉంటాయి. వేలాది ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి.



పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

● కొరవడిన ఆసక్తి

జగనన్న గృహాలకు కేవలం 6 అంకణాలు స్థలం మంజూరు చేయడం, లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమవడం, వైసీపీ కాంట్రాక్టర్లు నిర్మాణ బాధ్యతలు చేపట్టి నాసిరకం నిర్మాణాలు చేపట్టడం తదితర కారణాలతో లబ్ధిదారులు గృహాలపై ఆసక్తి చూపడం లేదు.

● అంతుపట్టని ప్రభుత్వ ఆలోచన

జగనన్న గృహాల్లో అడుగడుగునా అవినీతి జరిగిందని, 6 అంకణాల స్థలంలో ఇళ్లు ఎలా నిర్మిస్తారని, ఎలా కాపురం చేస్తారని అప్పట్లో ప్రతిపక్షంలో కూటమి నేతలు పెద్దఎత్తున నినదించారు. ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం ఏర్పడి 13నెలలు పూర్తయినప్పటికీ జగనన్న గృహాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రభుత్వ ఆలోచన అంతుపట్టక లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు.



గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

● శ్రీనివాసులురెడ్డి, ఏఈ

కావలిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని, ఇందుకు ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి పూర్తి సహకారం అందించారు. ఈ క్రమంలో అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కావలి రూరల్ ఏఈ చేజర్ల శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.

? మండలంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల మార్పునకు చర్యలు తీకున్నారా.

! ఇప్పటికే మండలంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసున్నాం.

? ముసునూరు ఇందిరమ్మ, తదితర కాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎలా పరిష్కరిస్తారు.

! నూతనంగా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు లాగుతాం.

? సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. ఉన్న సిబ్బందితో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం.

? రైతులకు కొత్తగా ఎన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.

! కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలోని గ్రామాల్లో 500 పైన విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేశాం.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ముందుకు సాగుదాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ అధ్యక్షతన నిర్వహించిన విజన్-2047 సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలను వివరించారు. ప్రతిగ్రామానికి తాగునీరు, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్, యువతకు ఉపాధి అవకాశాలు, పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, ట్యాబ్‌లు, క్రీడా పరికరాలు, గ్రామీణ ప్రాంతాల్లో టెలీమెడిసిన్‌తో కూడిన హాస్పిటల్స్, నియోజకవర్గ కేంద్రంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అలాగే సీసీ రోడ్లు, వంతెనల ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, రైతులకు సబ్సిడీ పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ గద్దల రెక్కలు విరిసి సముద్రంలో వేస్తాం

● మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు



మహిళా రైతు కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఉలవపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : పచ్చని గ్రామంపై కార్పొరేట్ గద్దల కళ్లు పడ్డాయని, వాటి రెక్కలు విరిచి బంగాళాతంలో పడేసే వరకు మహిళా రైతు కూలీల పోరుబాటలో భాగసామ్యులమై పోరాడతామని మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు తెలిపారు. మంగళవారం మహిళా సంఘాల వైక్య వేదిక నాయకులు కరేడు గ్రామంలో పర్యటించి వేరుశనగ, ఆకుకూరలు, కూరగాయలు పండించే పొలాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా అరకొరగా ఉన్న భూముల్లో ఏడాదిపాటు వ్యవసాయం చేసుకుంటూ, ఇతరుల పొలాల్లో కూలి పనులకు వెళుతూ తద్వారా వచ్చే సంపాదనతో కుంటుబాన్ని నెట్టుకొస్తున్నామని కూలీలు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు పెడితే చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు ఇస్తారు సరే.. భూమిమీద ఆధారపడి, రోజువారి కూలీలుగా జీవనం సాగించే మాబోటోళ్ల పరిస్థితి ఏమిటన్నారు. అనంతరం ఆకుతోట సంఘం ఎస్టీ కాలనీలో పర్యటించి వారికి మాకు పంట భూములు లేవు, ఉన్నదల్లా ఈ కాలనీ మాత్రమేనని, ఇవికూడా తీసేసుకుంటారంటా.. బయటకు వెళ్లి బతికే శక్తి మాకులేదని ఎస్టీలు వాపోయారు. అనంతరం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ రమాదేవి మాట్లాడుతూ కరేడు గ్రామంలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు స్వయంగా పర్యటించి బాధితుల అభిప్రాయం తెలుసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి పేరుతో పచ్చని పంట పొలాలు జోలికి వెళ్లకుండా, జీవో 43 రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్ పద్మశ్రీ, సీపీఐ నేత అక్కినేని వనజ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని, ఐద్వా రాష్ట్ర సహాయక కార్యదర్శి రమణి, స్థానికుడు మోహన్ పాల్గొన్నారు.



వీధి లైట్లకు మరమ్మతులు



వీధి లైట్లు వేస్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో వీధి లైట్లకు మంగళవారం స్థానిక సర్పంచు సాదు శ్రీలత మరమ్మతులు చేయించారు. 'వలేటివారిపాలెంలో అంధకారం' పట్టించుకోని పాలకులు, అధికారులు అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సర్పంచు స్పందించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మరమ్మతులకు గురైన వీధిలైట్లను బాగు చేయించారు. అవసరమైన చోట కొత్త ఎల్ఈడీ బల్బులు వేయిస్తున్నారు.

ప్రజలకు పోలేరమ్మ ఆశీస్సులు ఉండాలి

● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ ఆశీస్సులు పొందుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పటణంలోని 1వ వార్డు అడవిరాజుపాలెం, కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామాలలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ల కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఇళ్ల నుంచి ఊరేగిం పుగా అమ్మవారి ఆలయాల వద్దకు వచ్చి అక్కడ పొంగళ్లు పెటుకుని అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ రెండు గ్రామా ల్లోని పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రజలు కులమత, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పండుగ వాతావరణంలో పోలేరమ్మ పొంగళ్లు పెట్టుకోవడం ఆయా గ్రామాలకు శుభ పరిణామం అన్నారు. ఆయా గ్రామాల్లో కొందరి నేతల ఇళ్లకు వెళ్లి వారితో వేడుకలను పంచుకున్నారు.

తాగునీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు

● కమిషనర్ శ్రావణ్‌కుమార్



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, డీఈ తదితరులు

కావలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ డీఈతో కలిసి వైకుంఠపురం ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరా సరిగా జరగటం లేదని, బావులు, బోర్‌లలో నీరు అడుగంటి ఉందని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ వైకుంఠపురం ప్రాంతంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని వెలగపాడులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సీసీరోడ్లు, పక్కా గృహాల నిర్మాణం, పింఛన్ల మంజూరు వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, బూత్ ఇన్‌చార్జ్ గొల్లపూడి ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరేడు ఉద్యమం నుంచి తప్పుకుంటున్నా

● మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని రైతులు కలవడం ఉద్యమ ద్రోహం

● బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్

కందుకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కరేడు రైతుల ఉద్యమం నుంచి తప్పుకుంటున్నానని, రైతులు వెళ్లి వైసీపీ అధినేత జగన్‌ను కలవడం ఉద్యమ ద్రోహమని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఈ సమస్యకు మూల కారణం జగన్ కాగా కరేడు రైతుల తీరు దొంగచేతికి తాళాలు ఇచ్చినట్లుగా ఉందని ఆయన ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యంగా జరుగుతున్న ఉద్యమాన్ని రైతుల కోసం నా కష్టాన్ని కొందరు రైతులు నీరుగార్చారని అందుకే ఈ ఉద్యమం నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. కరేడు రైతులు వేలాదిగా వచ్చి జాతీయ రహదారిని దిగ్బంధించిన ఉద్యమంలో ఈయన ముందుండి నడిపించిన విషయం తెలిసిందే. హైకోర్టు న్యాయవాదుల బృందం కరేడులో పర్యటించి రైతులకు సంఘీభావం ప్రకటించటం, వారు రైతులకు సంపూర్ణంగా అండగా ఉంటామని న్యాయపోరాటం చేస్తా మని ప్రకటించటంలో కూడా క్రియాశీలంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఉద్యమం నుంచి తప్పుకుంటున్నట్లు చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది.

పాలిటెక్నిక్ కళాశాలకు దాతల చేయూత



దాతల దాతృత్వంతో కొనుగోలు చేసిన టోటల్ స్టేషన్ పరికరాన్ని చూపుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కావలి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు స్టోనెక్స్ ఆర్-1 ప్లస్ 300 టోటల్ స్టేషన్ పరికరాన్ని దాతల సహకారంతో కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కళాశాలలో ఆ పరికరాన్ని ప్రదర్శించి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఆధునిక సర్వే పరికరం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. టోటల్ స్టేషన్ పరికరం వితరణకు తనతో పాటు దాతృత్వం అందించిన నంద్యాల ఈసీఈ రిటైర్డ్ సీనియర్ లెక్చరర్ జింక సుబ్బరాయుడు, నంద్యాల నుంచి కావలి బదిలీపై వచ్చిన హెడ్ ఆఫ్ సివిల్ ఇంజనిరింగ్ శ్రీనివాస రెడ్డి, మద్దూరుపాడుకు చెందిన శ్రీనివాస పైప్ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ రామ్మోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో టోటల్ స్టేషన్‌పై సర్వేయింగ్ సర్టిఫికెట్ కోర్స్ తమ కళాశాలలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇది విద్యార్థులకు, స్థానిక పరిశ్రమ వృత్తిపరులకు ఎంతగానో ఉపయోగం కానుందన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వలేటివారిపాలెం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని చుండి, పోకూరు, వలేటివారిపాలెం, శింగమనేనిపల్లె తదితర గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఘట్టమనేని లక్ష్మీనరసింహం, గుర్రం లక్ష్మీనరసింహం, చెరువుపల్లి సాంబశివరావు, నాగభూషణం, కాకుమాను ఆంజనేయులు, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, వీరమోసు అంజయ్య, గౌడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యాన కళాశాల వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధ్యాపకులు, శాస్త్రవేత్తలు

కందుకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఓగూరు వద్ద నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యాన కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యాన కళాశాల అధ్యాపకులతో పాటు స్థానిక సీటీఆర్ఐ, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యానపంటల సాగులో నూతన పద్ధతులు, మిల్లెట్ల సాగు తదితర అంశాలపై తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థుల వ్యవహారాల అధికారిణి డాక్టరు యస్.సూర్యకుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించటమే గాక సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దటంలో సహాయ పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు ఎం.పవిత్ర, టి.పద్మలత, ఎం.శిరీష, సీటీఆర్ఐ హెడ్ ఎం. అనూరాధ, శాస్త్రవేత్త జి.హరిబాబు, కేవీకే హెడ్ జి.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

542 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 611 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 542 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-47, ఆర్ఆర్-1, సీఆర్-20, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 69 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.197.53గా నమో దైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉండాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

లింగసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉండాలని మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్సార్ చెప్పారు. ప్రపంచ యూత్ స్కిల్ డే సందర్భంగా మంగళవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మహమ్మద్ హఫ్సార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ ఎం పాండురంగయ్య, టి కిరణ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడప గడపకు వెళదాం : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు, ఏడాది పాలనలో ఎంత వరకు చేశారో.. ప్రజలను ఎంత మోసం చేస్తున్నారో గడప గడపకు వెళ్లి వివరించాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలులోని వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' పేరుతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, మండల ఉపాధ్యక్షురాలు ఎం.పద్మ, జడ్పీటీసీ కీర్తన, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కూటమి ప్రభుత్వంతోనే ఆర్థికాభివృద్ధి

లింగసముద్రం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని మండలంలోని పెదపవని బూత్‌స్థాయి ఏజెంటు నర్సింశెట్టి వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం మండలంలోని పెదపవని, అన్నెబోయినపల్లి గ్రామాలలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. అర్హులకు పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
3 తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025

19న తిరుపతికి సీఎం చంద్రబాబు రాక



తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 19న తిరుపతికి విచ్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పాల్గొనే వేదికను సిద్ధం చేయడానికి మంగళవారం మధ్యాహ్నం దామినేడు సమీపంలోని తూకివాకం వద్ద తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన ఎస్‌డబ్ల్యూపీసీకేంద్రాన్ని, నగరంలోని ఎస్వీయూ స్టేడియం, ఎస్పీజేఎన్ఎం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికను బుధవారం ఖరారు కానున్నట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



పాము పగబడుతుందా? మనిషి పగబడతాడా??
నిజమేమిటంటే పాముకు పగబట్టే శక్తి లేదు. మనిషికే ఆ శక్తి ఉంది. పగబట్టి మరీ పాములను చంపేస్తుంటారు.
అందుకే.. 'పాముకు తలలోనే విషం.. మనిషికి నిలువెల్లా విషమే!' అనే సామెత పుట్టింది.
ఇంతకీ పామువల్ల మనిషికి ప్రమాదమా?
మనిషి వల్ల పాముకు నష్టమా??
మనిషి వల్ల పాముకే నష్టం పాపం!

కనిపిస్తే కొట్టి చంపేస్తారు. ఇది తప్పు.. పాము - పర్యావరణ సమతుల్యతలో చాలా ప్రాధాన్యంగలది అని చెప్పడానికే ఏటా జూన్ 16న వరల్డ్ స్నేక్ డే ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా శేషాచలంలో ఉండే పాములతో పాటూ, మన ప్రాంతంలో సంచరించే పాములూ వాటి లక్షణాల గురించి ప్రత్యేక కథనం..

- 4వ పేజీలో

ఎస్వీయూలో
చిరుతల
కలకలం

వెయ్యి కాదు
5 వేల మంది
తొలగించే
దమ్ముందా?

- 4లో -

'ముక్కంటి' ఆలయ ఛైర్మన్ ఎవరు?

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి ఛైర్మన్ ఎవరు? ఈ ప్రశ్నకు రెండు మూడు రోజుల్లో స్పష్టత రానున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై వారం రోజులుగా సాగుతున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. అన్నీ సజావుగా సాగితే గురువారం ఛైర్మన్ పదవి ఎవరికి ఖరారైందన్న విషయాన్ని అధికారికంగా ప్రకటించనుంది అధిష్ఠానం. ఆశావహుల వడపోత, నేపథ్యాల పరిశీలన జరుగుతుండడంతో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



మొదలైన కసరత్తు

రెండు మూడు రోజుల్లో ప్రకటన

అధినేత పరిశీలనలో పలువురి పేర్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచీ ఏడాది కాలంగా ముక్కంటి ఆలయ పాలకమండలి ఛైర్మన్ పదవి కోసం ఆశావహులు ఆత్రుతగా నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలోని 6-సి కేటగిరీ ఆలయాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యముంది. దానితో పాటే రోజువారీ భారీ సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయం కావడం, రోజువారీ రూ.కోటికి పైగా ఆదాయం వున్న ఆలయం కావడంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. అదే స్థాయిలో పాలకమండలి పదవికి తీవ్ర పోటీ కూడా వుంది. ఏడాదిగా ఆశావహులు ఎదురుచూపులు ఫలించే సమయం ఆసన్నం కావడంతో రకరకాల మార్గాల్లో తమ ప్రయత్నాలను ఉధృతం చేస్తున్నారు.

ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి జాబితా పెద్దదే!

పాలకమండలి ఛైర్మన్ పదవిని ఆశించే వారిలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు ముందు వరుసలో వున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆయన కుటుంబం పార్టీలో కొనసాగుతుండడంతో పాటు పార్టీకి, బొజ్జల కుటుంబానికి ఆయన నమ్మిన బంటుగా పేరుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల వేధింపులకు గురి కావడం, సుమారు ఎనిమిది కేసులను ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సిఫారసు చేసిన ఏకైక పేరు ఈయనదే కావడం గమనార్హం. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన వర్గం నుంచీ మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ పేరును అధిష్ఠానానికి ప్రతిపాదించారు. టీడీపీ నుంచీ సీనియర్ నేతలు రెడ్డివారి గురవారెడ్డి, దశరథాచారి కూడా పదవి ఆశిస్తున్నారు. వీరు నేరుగా అధిష్ఠానాన్నే నమ్ముకున్నారు. బీజేపీ ముఖ్యనేత కోలా ఆనంద్ తన కుటుంబసభ్యుల్లో ఒకరికి పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. వీరు కాకుండా జనసేన నుంచీ మాజీ ఇన్‌ఛార్జి వినుత భర్త చంద్రబాబు పేరు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉండేది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో జనసేన అధిష్ఠానం వారిని బహిష్కరించడం తెలిసిందే. తిరుపతికి చెందిన ఓ విద్యా సంస్థ అధినేత పేరు కూడా జనసేన తరపున బలంగా వినిపిస్తోంది. అయితే స్థానికేతరులు కావడంతో వెనుకబడినట్లు సమాచారం. చెంచయ్యనాయుడికి పదవి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధిష్ఠానం వద్ద గట్టిగా పట్టుబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో అస్తవ్యస్తంగా వున్న ముక్కంటి ఆలయ నిర్వహణను తాను ప్రక్షాళన చేసి చక్కదిద్దానని, ఇపుడు తాను సూచించిన వ్యక్తినే పాలకమండలి ఛైర్మన్‌గా నియమిస్తే ఆలయ నిర్వహణ సక్రమంగా ఉంటుందని చెబుతున్నట్లు సమాచారం.

ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టిన అధిష్ఠానం

ముక్కంటి ఆలయ పాలకమండలి ఛైర్మన్ పదవి ఖరారు చేసే ప్రక్రియ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టినట్లు సమాచారం. ఈ సర్వేలో ఆశావహుల పేర్లు ప్రస్తావించి పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తోందని తెలిసింది. నేతల సిఫారసుల సంగతి పక్కన పెడితే ఐవీఆర్ఎస్ సర్వేలో వచ్చే ఫలితాలను బట్టే ఛైర్మన్ పదవికి తగిన ఆశావహుని ఎంపిక చేసే పరిస్థితి వుందని తెలిసింది. మొత్తానికీ రెండు మూడు రోజుల్లో వెలువడనున్న పాలకమండలి ఛైర్మన్ ఎంపిక ప్రకటన కోసం ఆశావహులతో పాటు కూటమి పార్టీల శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు సైతం ఆత్రుతగా వేచి చూస్తున్నారు.

గుర్తింపులేని రాజకీయ పార్టీకి షోకాజ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి ఆరు ఏళ్లల్లో కనీసం ఒక ఎన్నికల్లో కూడా పోటీ చేయని గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా గూడూరు మిట్టపాళెంలోని తెలుగు బహుజన పార్టీకి షోకాజ్ నోటీసు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు ప్రధాన ఎన్నికల అధికారికి ఆ పార్టీ అధ్యక్షుడు కానీ, కార్యదర్శి కానీ అన్ని రకాలా ఆధారాలతో రాతపూర్వకంగా వివరణ లేఖ అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 21 లోపు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్ ప్రధాన ఎన్నికల అధికారి ముందు హాజరు కావాలని సూచించారు.

రూ.68 లక్షల నాన్ జ్యుడీషియల్ స్టాంపుల రాక

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఎట్టకేలకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరాయి. వీటిని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తరలిస్తున్నారు. రూ.68లక్షల విలువైన (48వేల రూ.100 స్టాంపులు, 40వేల రూ.50 స్టాంపులు) అందాయి. మూడు నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. ప్రజలు రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలకు ఈ స్టాంపులే వినియోగిస్తుంటారు. ఈ కొరతను అవకాశంగా తీసుకుని స్టాంపు వెండర్లు అధిక ధరలకు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఇండెంట్ పంపడంతో ఈ మేరకు స్టాంపులు వచ్చాయి.

డిప్లొమాలో లేటరల్ ఎంట్రీకి రేపటిలోగా దరఖాస్తు చేసుకోండి

- 19న ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): బ్రిడ్జికోర్సు పూర్తిచేసిన ఐటీఐ విద్యార్థులు నేరుగా డిప్లొమా ఇంజినీరింగ్‌లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకోసం ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఏ కళాశాలలో సీటు కావాలనుకుంటారో ఆ కళాశాలలోనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆయా కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులు 19వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, సీటు పొందినవారు అప్పటికప్పుడే రుసుముకింద సుమారు రూ. 6 వేలు చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.

కడప జిల్లా సర్పంచి అరెస్టు

- చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన పర్యవసానం



తిరుపతి(నేరవిభాగం), జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రఫ్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రఫ్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం వచ్చింది. అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

రేపు టెన్త్, ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి పద్మజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు 17వ తేదీ ఉదయం 10గంటలకు చిత్తూరులోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం కాంప్లెక్సులోని జిల్లా కో-ఆర్డినేటర్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

ఆడుదాం.. ఆంధ్ర

- విజేతల ఎంపికలో వైసీపీ మార్కు రాజకీయం
- వారం రోజుల్లో డీజీపీకి విజిలెన్స్ నివేదిక

క్రీడా కిట్లు ఏమయ్యాయి?

'ఆడుదాం.. ఆంధ్రా'లో నిధుల దుర్వినియోగం జరిగిందా? క్రీడా కిట్ల నుంచి బహుమతుల ప్రదానం వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారా? పాఠశాలలకు చేరాల్సిన కిట్లు ఏమయ్యాయి? వీటిపై విజిలెన్సు విచారణ కొలిక్కి వచ్చింది. వారం రోజుల్లో డీజీపీకి నివేదిక అందించనున్నట్లు తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



'ఆడుదాం.. ఆంధ్ర' కార్యక్రమం 2023 డిసెంబరులో ప్రారంభమైంది. గ్రామ, వార్డు స్థాయిలో ఆటలు జరిగాయి. 2024 జనవరిలో మండలస్థాయిలో, జనవరి నెలాఖరులో మున్సిపాలిటీ.. ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లా స్థాయిలో వివిధ రకాల ఆటలు ఆడించారు. దీనికోసం ప్రభుత్వం ప్రతి మండల, మున్సిపల్, నియోజకవర్గానికి సంబంధించి రూ.25,000 వంతున.. ప్రతి వార్డు, గ్రామ సచివాలయానికి రూ.10,000 చొప్పున మంజూరు చేసింది. ఇవన్నీ కలిపి చిత్తూరు జిల్లాకు రూ.81 లక్షలు, తిరుపతి జిల్లాకు రూ.83 లక్షలు వచ్చాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటలు ఆడారు. ఒక్కో ఆటకు సంబంధించి దాదాపు 10 కిట్లు శాప్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి ఆయా జిల్లాలకు పంపిణీ చేశారు. ఇవి నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో గోల్‌మాల్ జరిగి నిధులు దుర్వినియోగమైనట్లు విమర్శలు వచ్చాయి. దీంతో వీటిపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో విచారణ సాగింది. ఈ విచారణలో కిట్ల నాణ్యతకు సంబంధించి విస్తుపోయే అంశాలు వెలుగు చూసినట్లు తెలిసింది. రాష్ట్రస్థాయిలో కొని పంపిన బ్యాట్లు, బాల్స్ షటిల్ బ్యాట్‌లు, టీ షర్టులు, కార్కులు ఇతరత్రా వస్తువులు పూర్తిగా నాణ్యత లోపించినట్లు విచారణలో తెలిసిందని ఓ అధికారి చెప్పారు. ఒక ఆటలో వాడిన కిట్లు.. రెండో ఆటకు పనికి రాకుండా పోయాయని కొందరు ఆటగాళ్లు విజిలెన్సు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. మరోవైపు.. ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా కిట్లను ఆడుదాం-ఆంధ్ర ఆటలు ముగిశాక సంబంధిత పాఠశాలలకు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ, అప్పట్లో ఆ కిట్లు పాఠశాలలకు చేరలేదని తెలిసింది. ఆ కిట్లు ఏమయ్యాయనే దిశగానూ విజిలెన్సు అధికారులు విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విజేతల ఎంపికలోనూ వైసీపీ మార్కు రాజకీయం సాగినట్లు ఆరోపణలున్నాయి. తమకు కావాల్సిన కార్యకర్తలను విజేతలుగా ఎంపిక చేసినట్లు విమర్శలున్నాయి. కొన్నిచోట్ల విజేతల అకౌంట్లలో డబ్బులు జమ చేయనట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం. ఇలా.. అన్ని కోణాల్లోనూ విచారణ ముగించిన అధికారులు.. వారం రోజుల్లో డీజీపీకి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

ధరలున్నా.. తెగుళ్ల శాపం..!

- 'ఊజీ'తో టమోటాకు నల్లటి మచ్చలు

సోమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా సాగు చేసే టమోటా రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులు టమోటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. సోమల మండలంలో విస్తారంగా టమోటా సాగు చేపట్టారు. గత సీజన్‌లో రికార్డుస్థాయిలో ధరలు పలికిన టమోటా సాగుపై మక్కువ పెంచుకున్న రైతన్నలు సోమల, నంజంపేట, కందూరు, నెల్లిమంద, నడింపల్లె, ఇరికిపెంట, అన్నెమ్మగారిపల్లె తదితర పంచాయతీల్లో సుమారు 3,600 ఎకరాల్లో గత డిసెంబరు నుంచి విడతల వారీగా సాగు చేపట్టారు. 15 కిలోల బాక్సు జూన్ నెల వరకు రూ.30 నుంచి రూ. 60 మాత్రమే పలికి రైతులు నష్టాలపాలయ్యారు. కొందరు రైతులు కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాక చేతి నుంచి చెల్లించారు. మరికొందరు తోటల్లోనే కాయలను పశువులకు



మేతగా వదిలేశారు. ఫిబ్రవరి, మార్చి వరకు నాట్లు వేసిన తోటల్లో దిగుబడులు వచ్చిన రైతులు ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి నష్టపోయారు. ఏప్రిల్ నెలలో నాట్లు వేసిన తోటల్లో జూలై నెలలో దిగుబడులు వచ్చిన రైతులకు మాత్రమే 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.300 చేరుకోవడంతో పెట్టుబడులు మాత్రమే చేతికి అందాయి. ఈ సమయంలోనే వాతావరణం అనుకూలించక తోటల్లో పలు రకాల చీడపీడలు ఆశించడంతో వారంలో రెండు సార్లు మందులను పిచికారీ చేస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. 100 బాక్సుల్లో 50 బాక్సులు ఊజీ ఈగల దాడులతో దెబ్బతిన్న కాయలు, నల్లమచ్చ కాయలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల తీవ్రతతో మొక్కలు ఎదుగుదల లేక పలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు సార్లు కోతలు కోస్తే దిగుబడులు తగ్గిపోతున్నాయి.ఈ పరిస్థితిలో నష్టాలే మిగులుతున్నాయని ఆందోళన



టమోటా తోటల్లో పండ్లపై నల్లని మచ్చలు

చెందుతున్నారు. టమోటాకు నల్లమచ్చలు, ఆకుముడత, తెల్లదోమ, పచ్చదోమలు వ్యాప్తి అధికంగా ఉండి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడం, ధరలు ఉండి టమోటాలో నాణ్యత లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారు. టమోటా సాగుకు బిందుసేద్యం, కట్టెలు నాటడం, దారం వంటి ఖర్చులు పెరగడం, వాతావరణం అనుకూలించక వైరస్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా తోటల్లో ఊజీ ఈగలు బెడదతో కోతలు చేయకుండానే తోటల్లోనే పండ్లను వదిలేస్తున్నారు.ధరలు కొంత ఊరటగా ఉన్నా ఊజీ ఈగలు, నల్లమచ్చ తెగుళ్లతో నష్టపోతున్నారు.

రేపటి నుంచి పాలిసెట్ చివరిదశ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ గురువారం నుంచి 20వ తేదీ వరకు ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని విద్యార్థులు 17 నుంచి 19వ తేదీలోపు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చని సూచించారు. ఫీజు చెల్లించినవారు 18వ తేదీ నుంచి 20వ తేదీలోపు ఎంపికలు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీఈఈ సెట్ అభ్యర్థులకు రేపటినుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీఈఈ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించినట్లు కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర్వాత ఈ నెల 17 నుంచి 22వతేదీవరకు డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఈనెల 25వ తేదీనుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.



ఇదీ విషపూరితమే. బ్యాండెడ్ సీ క్రైట్ (సముద్రపు కట్లపాము)

డేంజర్ స్నేక్ కింగ్ కోబ్రా

కట్లపాము కరిస్తే అంతే!

శేషాచలకొండల్లో గుర్తించిన గాలిలో ఎగిరే శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్

శేషాచల కొండల్లో అరుదుగా కనిపిస్తూ అంతరించిపోతున్న సన్నని పగడపు పాము



శేషాచలంలో 35 రకాల పాములు

దేశంలో ఉన్న పాముల జాతులు: 300, విషపూరితమైనవి: 60


అత్యంత విషపూరితం: ఇండియన్ కోబ్రా, నాగుపాము, రక్తపింజరి, కట్లపాము, గుడ్లపింజరి

పా..పా..పాము!

ప్రమాదకరం కాదు

శేషులచలం : తిరుమల శేషాచలం కొండల్లో 35 రకాల పాములు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అరుదైన జాతులు. అవి.. ఇండియన్ సాండ్ స్నేక్ (ఎర్ర ఇసుకబోతు), నాగార్జునసాగర్ రేసర్ (బోలావలి), శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్(గాలిలో ఎగిరే పసిరిక పాము), సన్నని పడగపు పాము(ఇది అంతరించి పోతోంది). అయితే శేషాచలంలోని సర్పజాతులపై ప్రత్యేకమైన పరిశోధనలు ఏవీ ఇంత దాకా జరగనే లేదు. అందువల్లే ఉన్న 35 రకాల పాములకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా అందుబాటులో లేదు.

పాము కనిపించగానే ముందుగా ఒళ్లంతా పాములా జరజరా భయం పాకుతుంది. అది మీదకి వచ్చి కాటేసేస్తుందేమో అనే ఆందోళన కలుగుతుంది. విషపు కీటకం.. కొట్టి చంపేస్తేనే మేలు అనే అభిప్రాయానికి వస్తారు. కర్రతోనో, రాళ్లతోనో ఇక పాము మీద దాడి చేస్తారు. అది పారిపోయే ప్రయత్నం చేస్తుంది. దెబ్బ తగిలి తప్పించుకుంటే పాము పగబడుతుందనే నమ్మకంతో ఎట్లాగైనా చంపేయాలనే పట్టుదలతో పాము ప్రాణాలు తీసేస్తారు. ఆ తర్వాత మళ్లీ దానికి దహనక్రియలు చేస్తారు. పాలు పోస్తారు. దణ్ణం పెట్టుకుంటారు. దేవతగా ఒకవైపు పూజిస్తూనే కనిపిస్తే మాత్రం పామును కొట్టి చంపేసే విచిత్ర నైజం మనిషిది. మనిషిలోని భయమే పాము ప్రాణాలు తీస్తోంది. నిజానికి కనిపించేవన్నీ విషం కాదు. ఏది విషం, ఏది కాదు అని తెలిస్తే చాలు.. చాలా పాములు పాపం బతికిపోతాయి. ఈ రోజు స్నేక్ డే సందర్భంగా మన ప్రాంతంలో ఉండే పాములూ.. వాటి విశేషాలపై ప్రత్యేక కథనం..



కొండ చిలువ సైజు పెద్దదేగానీ విషం ఉండదు



విషపూరిత రక్త పింజర

మన సముద్ర జలాల్లో 16 రకాల పాములు

పాములు భూమ్మీద మాత్రమే కాదు సముద్రంలో కూడా ఉంటాయి. తరచూ మత్స్యకారుల వలల్లో పడుతుంటాయి. వీటిని తిరిగి నీళ్లలో వదిలేస్తుంటారు. తిరుపతి జిల్లాలో 16రకాల సముద్రపు పాములున్నాయని అంచనా. వీటిలో చాలా వరకు విషపూరితమైనవిగానే గుర్తించారు. తడ, వాకాడు, కోట సముద్ర తీర ప్రాంతాల్లో ఇవి మత్స్యకారులకు తారసపడుతుంటాయి. వాలుకుర్తిపాము, కస్తూరినాగపాము, హైడ్రోఫిష్ పాము, గలంగిరి, వాలగిరి, చంబాబు, నల్లదాసు పాములు ఎక్కువగా మన జిల్లాలోని సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. అలాగే సముద్ర తీరంలోని ఇసుక ప్రాంతాల్లో ఇండియన్ సాండ్ బోవ(ఎరిక్స్ జోని), కాండనారస్, స్టొట్ సాండ్ స్నేక్ వంటి పాములు కనిపిస్తుంటాయి.ఇక తిరుపతి జిల్లాలో ఉన్న పులికాట్ సరస్సులో వాన పాములు, సేతుపాములు మాత్రమే ఉంటాయి. ఇవి విషపూరితం కాదు. ఇక్కడి వానపాము (ఎర్ర) సైజు చాలా పెద్దదిగా ఉంటుంది. అందుకే పెద్ద ఎత్తున వీటిని సేకరించి స్మగుల్ చేస్తుంటారు.

WORLD SNAKE DAY

మాయా సర్పం: పూడుపాము

తరచూ మన ప్రాంతంలో వార్తల్లో ఉండేది పూడుపాము. దీనిని స్మగ్లింగ్ చేస్తూ పట్టుకున్నారు అని చదువుతూ ఉంటాం. విదేశాలకు దీనిని తరలిస్తుంటారని చెబుతారు. ఒక పాము విలువ కోటి దాకా పలుకుతుందని కూడా ప్రచారం. అయితే అసలు ఈ పాము ఎందుకు స్మగుల్ అవుతోంది? దీని వల్ల ఉపయోగాలు ఏమిటి అనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. దీనికి అతీంద్రియ శక్తులుంటాయనీ, ఇంట్లో పెట్టుకుంటే అదృష్టం అనీ, ఔషధ విలువలుంటాయనీ.. ఇలా రకరకాల ప్రచారాలున్నాయి. ఇవి నిజమో కాదో కూడా తెలీదు. అయినా ఇవి స్మగుల్ అవుతూ దొరుకుతూనే ఉన్నాయి. రెండు తలలున్నట్టుగా కనిపించే పూడుపాము ఎటువైపునకైనా కదులుతుంది. మన జిల్లాలో చాలా ప్రాంతాల్లో విస్తృతంగా ఇవి కనిపిస్తాయి. చురుగ్గా ఉండదు. మట్టిలో దాగి ఉంటుంది. ఇది విషపు పాము కాదు. అయినా కరిస్తే ఒళ్లంతా వికారంగా మచ్చలు వస్తాయని అంటారు. అందుకే మన ప్రాంతంలో ఎవరిమీదైనా కోపం ఉంటే 'వాడ్ని పూడుపాము కరవ' అని శాపనార్థం పెడతారు. మనదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పూడుపాములు ఉంటాయి. ఇరాన్, పాకిస్థాన్‌లలో కూడా కనిపిస్తాయి.



పాములను చంపద్దు.. ప్లీజ్!

నిజానికి పాములు రైతులకు మిత్రులనే చెప్పాలి. రైతులు కష్టపడి పండించిన పంటలను ఎలుకలు, మిడతలు ఇతర కీటకాలు తిని ధ్వంసం చేయకుండా వాటిని ఆహారంగా తీసుకుని పాములు రైతులకు మేలు చేస్తుంటాయి. పంట పొలాల్లో, అడవుల్లో, చెరువుల్లో కనిపించే పాములు అన్నీ విషంగల్లవి కావు. విషసర్పాలు కూడా మనిషి మీదకు రావు. వాటికి మనవల్ల ప్రమాదం అనిపిస్తేనే కాటేస్తాయి. కనిపించగానే భయపడి చంపేయకుండా స్నేక్ రెస్క్యూ టీంకి సమాచారం ఇస్తే పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తారు. చంపేసుకుంటూ పోతే భూమ్మీద పాము అనేదే లేకుండా పోతుంది. ఇందువల్ల సమతుల్యత దెబ్బతింటుంది.





- లక్ష్మీ సౌజన్య, రమణ నాయక్, పాములపై పరిశోధకులు

వాలంగిరితోనే ప్రమాదం

సముద్రంలో చేపలు పట్టేందుకు ఎన్నో తరాలుగా మేం వెళ్తూనే ఉన్నాం. వలలో చేపలతో పాటు కొన్ని పాములు కూడా పడుతుంటాయి. వాటిలో వాలంగిరి పాము అత్యంత విషపూరితమైంది. ఈ పాము కరిచి మా పూర్వీకులు చాలామంది మరణించారు. దీనికి మందు దొరకడం అరుదు. మిగతావి కరిచినప్పటికీ అంత ప్రమాదం ఉండదు.



- దక్షాది నటరాజన్, మత్స్యకారుడు, గోవిందపల్లి, కోటమండలం

స్నేక్ ఫ్రెండ్ : మనుషుల నుంచి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా దాదాపు 18వేల పాముల్ని పట్టుకుని భద్రంగా అడవుల్లో వదలిపెట్టిన స్నేక్ ఫ్రెండ్ ఒకరు తిరుపతిలో ఉన్నారు. తిరుమల కొండమీద, తిరుపతిలోనూ పాము కనిపించిందని సమాచారం అందగానే ప్రత్యక్షమైపోతారాయన. అలవోకగా పట్టి బంధించి దూరంగా విడిచిపెట్టే భాస్కర్‌నాయుడు కూడా రెండు సార్లు పాముకాటుకి గురై ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. అయినా ఈ పనిని శ్రీవేంకటేశ్వరస్వామి తనకు అప్పగించిన బాధ్యతగా భావిస్తారు. 1982లో టీటీడీ అటవీశాఖలో కూలీగా చేరిన ఆయన ఆ తర్వాత స్నేక్ క్యాచర్‌గా మారిపోయారు. ఆయన కోసమే ఒక పోస్టును టీటీడీ ఏర్పాటు చేయడం విశేషం. రిటైరై పదేళ్లయినా ఆయనకు కాంట్రాక్టు పద్ధతిలో అదే పనిని టీటీడీ అప్పగించింది. జీవవైవిధ్య పురస్కారాలు ఎన్నో అందుకున్న 69 ఏళ్ల భాస్కర్ నాయుడుకి శేషాచలం అడవుల్లో ఉండే అనేక రకాల పాముల గురించిన అవగాహన ఉంది.

"పాము.. రోడ్డుమీద, పార్కులో లేదా ఇంట్లోకి వచ్చినా భయంతో కేకలు వేస్తూ హడావుడి చేయవద్దు. పాము మీదకి రాళ్లు, చేతికందిన వస్తువులు, మట్టి వంటివి అసలు వేయకూడదు. అలా చేస్తే తనకు ప్రమాదం అని భావించి ఆత్మరక్షణ కోసం పాము తిరగబడుతుంది. కాటేస్తుంది. శబ్దం చేయకుండా దూరం నుంచి దాని కదలికలు గమనించండి. మనుషుల ఉనికి ఉన్నతావులో పాము ఉండదు. పొరపాటున వచ్చినా దూరంగా వెళ్లిపోతుంది. ఒకవేళ అక్కడే ఉండిపోతే టీటీడీ సిబ్బందికి సమాచారం ఇస్తే చాలు.. నేను వచ్చి దానిని పట్టుకుని దూరంగా తీసుకువెళ్లి విడిచిపెడతాను."



- భాస్కర్ నాయుడు, టీటీడీ స్నేక్‌క్యాచర్

ప్రత్యేక కథనం
మంగళం, ఆంధ్రజ్యోతి

సత్యవేడుపై ఎంతమంది పెత్తనం?

- సమన్వయం మాట వదిలి సమస్యలు వస్తున్నాయన్న ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'ఒకరేమో పరిశీలకులు అంటారు. మరొకరు కో-ఆర్డినేటర్ అంటారు. ఇంకొకరు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అంటారు. సత్యవేడుపై ఇలా ఎంత మంది పెత్తనం చేస్తారు' అని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నించారు. పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైకిల్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేగా తానుండగా మరొకరికి ఇన్‌చార్జి పదవి ఎందుకు? ప్రతి పక్ష ఎమ్మెల్యేలున్న చోట మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇప్పటికైనా అపోహలు వీడి కుల, గ్రూపు రాజకీయాలకు స్వస్తి చెప్పి నియోజకవర్గ అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకెళదాం' అని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలో కుల గ్రూపు రాజకీయాలను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడం కోసం టీడీపీ అధిష్ఠానం శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా నియమించిందే తప్ప ఇన్‌చార్జిగా కాదని మరోసారి ఆయన స్పష్టంచేశారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడైనా కొందరు నేతల మాటలు నమ్మి తన ఓటమికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, మరికొందరు గ్రూపు రాజకీయ నేతలతో కలసి సభలు, సమావేశాలు, ప్రచార ఆర్భాటాలు చేయడం వల్ల ప్రభుత్వం ఆశించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం మరుగున పడిపోతోందన్నారు. దీంతో పార్టీలో సమన్వయం మాట పక్కన నెట్టి పలు సమస్యలు వస్తున్నాయన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఇలాంటి పెత్తనాలు చేస్తే అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచినట్లు అవుతుందన్నారు. అలాంటి పనులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకరించరని ఆయన స్పష్టంచేశారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఉన్నానని, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ సీఎం చంద్రబాబుకు విధేయుడిగా ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, నీటి సంఘాల అధ్యక్షులు రవి రెడ్డి, పద్దురాజు, నాయకులు వాసురెడ్డి, డిల్లీ రాజేశ్వరి, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ రాక

- రేపు ఐఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుచానూరు వద్దనున్న తాజ్‌హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 11గంటలకు ఏర్పేడు వద్దనున్న ఐఐటీకి చేరుకుని ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

- వెయ్యి మంది కాదు 5 వేల మంది ఉన్నారు

తొలగించే దమ్ముందా?

- తిరుమలలో అన్యమతస్థుల అంశంపై చింతా మోహన్ సవాల్

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వెయ్యి మంది కాదు.. ఐదువేల మంది అన్యమతస్థులు ఉన్నారు. భక్తుల సేవలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. వారిని తొలగించే దమ్ము మీకుందా? తిరుపతి, తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఘాటుగా స్పందించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ముందు మంగళవారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అభివృద్ధిని బీజేపీ నేతలు పక్కన పెట్టి, ఎప్పుడూ అన్యమతం.. అన్యమతస్థులు అంటూ పవిత్రమైన తిరుమలపై రచ్చ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. నిరుద్యోగులు, పూట గడవని నిరుపేదల గురించి పట్టించుకోకుండా ఎప్పుడూ అన్యమతంపై మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. తిరుమలలో అన్యమతస్థులు ఎవరు.. ఏం పని చేస్తారో మీకు తెలుసా అంటూ ప్రశ్నించారు. మీరు చెప్పే అన్యమతస్థులే నిత్యం భక్తుల మల, మూత్రాలను శుభ్రం చేస్తూ, అతి తక్కువ జీతాలకు పనిచేస్తూ పొట్ట నింపుకుంటున్నారన్నారు. వారిని తొలగిస్తే తెలంగాణ నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తారా అంటూ వ్యాఖ్యానించారు. తిరుమలలో కాంగ్రెస్ హయాంలో తప్ప తర్వాత ఈవో, డిప్యూటీ ఈవో స్థాయిలో ఎస్సీలను నియమించకపోవడాన్ని చూస్తే తిరుమలలో అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఒక్క ఎస్సీ అధికారైనా తిరుమలలో ఉన్నారా అని ప్రభుత్వాన్ని అడిగారు. బ్యాంకుల రుణాల మాఫీ, ఎన్డీఏ పాలనలో జరిగిన రూ. లక్ష కోట్ల అవినీతిపై బండి సంజయ్ మాట్లాడితే బాగుంటుందన్నారు. టీటీడీలో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు 5 సెంట్ల నివాస స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

ఎస్వీయూలో చిరుతల కలకలం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో చిరుతలు విద్యార్థులు, ప్రజలను భయపెడుతున్నాయి. క్వార్టర్స్‌లోని పెంపుడు శునకాలను, వర్శిటీ సమీప ప్రాంతాల్లో ఉండే శునకాలను చిరుతలు వదలడంలేదు. చీకటి పడితే చాలు శేషాచల అటవీప్రాంతం నుంచి రీజనల్ సైన్స్‌సెంటర్ సమీప అటవీప్రాంతాల మీదుగా ఎస్వీ యూనివర్శిటీ, వేదిక్, వెటర్నరీయూనివర్శిటీ ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. ఇక్కడ సమీప ప్రాంతాల్లోని హాస్టల్ వద్ద వేసిన ఆహారం కోసం శునకాలు వస్తుంటాయి. అయితే అప్పటికే మాటు వేసిన చిరుతలు వీటిని చంపితిని తిరిగి అడవుల్లోకి వెళ్లిపోతుంటాయి. అలా వాటికి ఆహారం దొరకనిప క్షంలో వర్శిటీలోని క్వాటర్స్, హాస్టళ్ల వద్దకు వస్తున్నాయి. గత వారం రోజులుగా రెండు చిరుతల సంచరిస్తుండటాన్ని విద్యార్థులతో పాటు హాస్టల్స్‌సిబ్బంది , స్థానిక ప్రజలు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు మూడు ప్రాంతాల్లో బోన్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే చిరుతలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రాత్రి పూట ఆరుగురు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అయితే చిరుతల వల్ల ప్రమాదం ఎటువైపు నుంచి ముంచుకువస్తుందో అన్న భయంతోవిద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఎస్వీ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కిన చిరుత



ఎస్వీ యూనివర్శిటీలో చిరుతల కోసం అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన బోను

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.72 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,149
తలనీలాలు సమర్పించినవారు: 29,066

192 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

- కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా చేజర్ల అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ మోటారు సైకిల్, ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్వీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, స్థానిక ఎఫ్‌బీవో జనార్దన్‌తో కలిసి మంగళవారం నెల్లూరుజిల్లా చేజర్ల అటవీప్రాంతంలోని కలువాయి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఒక కారు, ఒక మోటారు సైకిల్‌తో కొందరు గుమికూడిపోలీసులక కంటపడ్డారు. వారిని చుట్టుముట్టి పట్టుకునే ప్రయత్నం చేయగా వారు పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకు చెందివారు, మరో ఇద్దరు నెల్లూరు జిల్లాకు చెందివారుగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన ఎర్రచందనం దుంగలతో పాటు సమీపంలో దుంగలను రీఫర్లు, పలకలుగా మార్చి దాచి ఉంచిన వాటితో సహా 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సిమెంటు రోడ్ల పక్కన కాస్త మట్టి పోయండి స్వామీ



వాకాడు రెడ్డివారిదిబ్బలో పక్కన మట్టిపోయని సిమెంటు రోడ్డు

వాకాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టింది. వాకాడు మండలంలోని వాకాడురెడ్డివారిదిబ్బ, తిరుమూరు, దుగరాజపట్నం, కొత్తూరు తదితర గ్రామాల్లో సుమారు రూ.66 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. అయితే పక్కన బర్మ్‌లకు మట్టిపోయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు రోడ్డుకు పగుళ్లు వచ్చి ధ్వంసం అవుతున్నాయని చెబుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రోడ్ల పక్కన మట్టి పోసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ వసంత భాయ్, పక్కన నోడల్ అధికారి వాసంతి, సీడీపీవో జ్యోతికిరణ్ తదితరులు

సూళ్లూరుపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ వసంత భాయ్ అన్నారు. మంగళవారం ఆమె సూళ్లూరుపేట పట్టణంలోని ఇసుక మిట్ట, రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలప్రీస్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం గర్భిణులు, పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. త్వరలోనే అంగన్వాడీ కేంద్రాలకు మొబైల్ ఫోన్‌లు అందజేస్తామని తెలిపారు. అంగన్వాడీలో చేపట్టే ప్రతి కార్యక్రమం వివరాలు మొబైల్ ఫోన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతికిరణ్, నోడల్ అధికారి వాసంతి, సూపర్‌వైజర్ మనీష సింగ్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

గూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఈనెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గతంలో 17 రోజులపాటు చేసిన సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శివకుమార్, బీవీ రమణయ్య, సాయి, రాఘవ, భాస్కర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజూ కొనసాగింది.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ కిషోర్‌బాబు

గూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని రూరల్ సీఐ కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎల్‌ఏపీ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందిన లీడర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ చదువుల్లో రాణించడం ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సుధేష్ణ, దయాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కోట, చెందోడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఎరువులు, పురుగు మందుల వినియోగం, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం వర్తించే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా అమ్మవారికి ఉయ్యాల సేవ

తిరుచానూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సహస్ర దీపాల వెలుగులో పద్మావతి దేవికి అత్యంత వేడుకగా ఊంజల్ సేవ మంగళవారం నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు.

తండ్రి, కొడుకుపై కేసు

వాకాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ మనపాళెం గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు ఆశిరెడ్డి, ప్రతాప్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... మనపాళెం గ్రామంలో సర్వే నెంబరు 30లో 15 ఎకరాలు గ్రామ కంఠం ఉంది. అందులో గ్రామస్తులు జీవన ప్రగతికి పది షాపులు పెట్టుకునేలా తీర్మానం చేశారు. 8 మంది తాత్కాలిక నిర్మాణాలు చేపడితే ఆశిరెడ్డి, ప్రతాప్ పక్కా ఇంటి నిర్మాణాలను చేపట్టడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మనపాళెం గ్రామస్తులపై ఆశిరెడ్డి, ప్రతాప్ దాడులు చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించాలి

చిల్లకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కొమరవారిపాళెం పాఠశాలలో విలీనం చేశారని, ఈ ప్రక్రియను నిలుపుదల చేసి తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. తూర్పు కనుపూరులోని 1నుంచి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవారిపాళెం పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం మానుకున్నారన్నారు. పాఠశాల విలీనంతో చిన్నారులు చదువులకు దూరమవుతున్నారన్నారు. అధికారులు విలీన ప్రక్రియను విరమించుకుని తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించి విద్యార్థులకు విద్య దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.





డంపింగ్ యార్డులో వ్యర్థాలను తోడుతున్న యంత్రాలు ● వ్యర్థాల రీస్లైకింగ్

మున్సిపాలిటీ నుదిటిన చెత్తకు ఇక చెల్లు

వ్యర్థాలతో బయోమైనింగ్ ద్వారా ఎరువుల తయారీ ● ఉద్యానవనం కానున్న డంపింగ్ యార్డు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ముఖ్య పట్టణం సూళ్లూరుపేట. ఇక్కడి నివాస గృహాలతో పాటు దుకాణాలు, వ్యాపార సముదాయాల నుంచి ప్రతిరోజూ టన్నుల కొద్దీ చెత్త పోగవుతోంది. పట్టణ నడిబొడ్డులో జాతీయ రహదారి పక్కనే హోలిక్రాస్ సమీపంలో కాళంగి నదిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను నిల్వ చేస్తున్నారు. ఈ ప్రక్రియ గత 30 ఏళ్లుగా సాగుతోంది. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిల్వలు చిన్నపాటి కొండలను తలపిస్తున్నాయి. దుర్వాసనతో పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈదురు గాలులకు చెత్తా, చెదారం గాల్లోకి ప్రవేశిస్తుండడంతో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడు డంపింగ్ యార్డులో మంటలు చెలరేగాయంటే రెండు వారాల పాటు రగులుతూనే ఉండేది. చెత్త నుంచి వచ్చే పొగతో పక్కనే నివాస ప్రాంతాలు ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా సూళ్లూరుపేటను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తచెదరాలను తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బయోమైనింగ్ పద్ధతి ద్వారా వ్యర్థాల ప్రాసెసింగ్ పనులను జిగ్మా సంస్థకు అప్పగించింది. జూన్ మొదటి వారం నుంచి డంపింగ్ యార్డులో పనులు మొదలయ్యాయి. 38261 మెట్రిక్ టన్నుల చెత్తను విభజించేందుకు యంత్రాలతో తిరగతోడుతున్నారు. అనంతరం పెద్దపెద్ద పరికరాలతో జల్లెడ పట్టి వ్యర్థాలను వేరు చేస్తున్నారు. ఆ వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను వేరుచేసే చకాచకా సాగుతోంది. యంత్రంతో వేరుచేసిన మట్టిని కంపోస్టు ఎరువుగా మారుస్తారు. అలాగే డంపింగ్ యార్డులో ఉన్న చెత్త వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను వేరుచేసి పునర్వినియోగించేలా చేస్తారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిల్వలను ఆగస్టు చివరి నాటికి పూర్తిస్థాయిలో వ్యర్థాలను శుభ్రం చేసి ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన ఉద్యాన వనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆదేశించింది.

రూ.713 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణం



ఆల్తూరుపాడు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు నిర్మాణం కోసం రూ.713 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయని, త్వరలో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన ఆల్తూరుపాడు గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కురుగొండ్ల మాట్లాడుతూ 2018లో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు మంజూరు చేసినట్లు చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రిజర్వాయర్ పనులు జరగనివ్వకుండా అడ్డుకొంటూ వచ్చిందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పనులను మొదలు పెట్టేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే డక్కిలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో 86వేల ఎకరాలకు సాగునీరు. తిరుపతి, తిరు మలకు తాగునీరు అందివ్వచ్చన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మా ణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు చెప్పారు. అలాగే నియో జకవర్గంలో గుంతలు లేని రోడ్లు చూడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, టీడీపీ నేతలు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చెంద్రారెడ్డి, శివప్రసాద్, మునిస్వామి రెడ్డి, పులి జనార్దనరెడ్డి, రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



నూతన కమిటీతో బీజేపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రం అమలుచేసే పథకాలు అందేలా పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా ఇంగిలా సాగర్, కె.నిర్మల కుమారి, తుర్లపాటి శ్రీనివాసులు, సృజన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పాకం శివ, ట్రెజరర్‌గా దుర్గి రమేష్, కార్యదర్శులుగా మునిశేఖర్, అన్నవరం మునిరత్నం, హైమావతి కార్యవర్గ సభ్యులుగా వినోద్ కుమార్ రెడ్డి, వెంకటేష్, సుబ్బారావు, అభిషేక్ జైన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆరణి విజయ భాస్కర్‌రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు సారె సమర్పణ



సారెతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారె సమర్పణ జరిగింది. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని కోటమ్మకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ చీర, సారెను సమర్పించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రావిగుంటపాళెంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

వాకాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని రావిగుంటపాళెంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, ఇంగిలాల బుజగేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను ప్లాస్టిక్ సర్జరీతో సరి చేయవచ్చు

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రమాదాలు, గాయాలు లేదా పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను సరిచేయడంలో దోహదపడుతుందని రుయా ప్రొఫెసర్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లతో పాటు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన పద్ధతులు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జన్స్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లు ప్రవీణ్, ఝాన్సీ విజయ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి

బాలయపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాలకు అర్హులైనవారిని త్వరితగతిన గుర్తించాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17నుంచి 25వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి బంగారు కుటుంబాల జాబితా సిద్ధం చేయాలన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక



ప్రశాంతిరాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంతిరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కావేరిపాకం కోటేశ్వరరావు, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమరావతి రామయ్య, చిగురాకుల సురేంద్రబాబు, పుట్టుపీరయ్య, గాదంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీ-4 పునఃపరిశీలన గ్రామసభలు

ఓజిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిమేనిపాడు, అత్తివరం, భట్లకనుపూరు గ్రామాల్లో మంగళవారం పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పీ-4 సర్వేలో ఎంపికైన బంగారు కుటుంబాల వివరాలను పరిశీలించడంతో పాటు ఇంకా అర్హత ఉన్న కుటుంబాలను జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకున్నారు.

నాయుడుపేట టౌన్: మండలంలోని కాపులూరులో పీ-4 సర్వే గ్రామసభను ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి గోపాల్, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తడ: మండలంలోని తడ, తడకండ్రిగ సచివాలయాల వద్ద పీ-4 సర్వే గామసభలు జరిగాయి. ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్ మాట్లాడుతూ గతంలో గుర్తించిన పేద కుటుంబాలలో 20శాతాన్ని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆర్ముగం, జయప్రద, పంచాయతీ కార్యదర్శులు మస్తాన్, గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి

వెంకటగిరి టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి వద్ద మామిడి కాయల ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో పడిపోవడంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.20లక్షలు అందించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మంగళవారం డిమాండ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



రోడ్డు మలుపులో గుంతలు

గూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని మలుపు వద్ద రోడ్డు దెబ్బతిన్నడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వివేకానంద రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా ముత్యాలపేటకు వెళ్లే రోడ్డు మలుపు వద్ద గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గూడూరు సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి



గూడూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సభ్యులుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డిలను నియమిస్తూ సహకారశాఖ కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గూడూరు సొసైటీకి పాలక వర్గం లేదు. తాజాగా సింగిల్ విండోలకు (పీఏసీఎస్) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీల నియామకం

చిట్టమూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల స్థానంలో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిట్టమూరు సొసైటీ చైర్మన్‌గా గుండుబోయిన కస్తూరయ్య, సభ్యులుగా కంటెపల్లి వెంకటరమణయ్య, నరమల మోహన్, మల్లాం సొసైటీ చైర్మన్‌గా రామిసెట్టి హర్‌నాథ్, సభ్యులుగా గొల్ల మణి, చేను వెంకటయ్యను నియమించారు.


నేటినుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆయన కార్మికులతో సమావేశమై ఈ విషయాన్ని వెల్లడించారు. కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించడంతో పాటు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలన్నారు. పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోలేదని, దీంతో సమ్మెబాట పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు చెంగయ్య, సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యానగర్‌లో జ్యోతి డే



బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద అధ్యాపకులు, విభాగాధిపతులు

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జ్యోతిడే వేడుకలు జరిగాయి. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధి పతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో విద్యా సంస్థలకు బాలకృష్ణారెడ్డి బీజం వేసిన రోజును జ్యోతిడేగా జరుపుకోవడం ఆనవాయితీ.

బీసీ మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన విజయవాడలో జరగనున్న జాతీయ బీసీ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్ పేర్కొన్నారు.